జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 07 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 211 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , భాద్రపద మాసము , తిథి: షష్ఠి - 10:17:05 వరకు నక్షత్రంమృగశిర - 26:55:46 వరకు కరణంవణిజ - 10:17:05 వరకు, విష్టి - 21:08:34 వరకు పక్షంకృష్ణ యోగంవ్యతీపాత - 18:17:27 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

### భారత వైమానిక దళానికి కొత్త అధిపతి

**29వ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా అశుతోష్ దీక్షిత్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): భారత వైమానిక దళానికి కొత్త అధిపతి నియమితులయ్యారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా పనిచేస్తున్న ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్‌ను తదుపరి చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. అక్టోబర్ 31న ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ పదవీ విరమణ చేయనుండగా.. అదే రోజు మధ్యాహ్నం దీక్షిత్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

మిగతా 2లో..

### కేసీఆర్, రేవంత్ కుటుంబాల ఆస్తులపై విచారణ జరపండి

**హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు లేఖ**

**సమగ్ర విచారణ జరిపించాలని రఘునందన్‌రావు వినతి**

హైదరాబాద్, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య సాగుతున్న రాజకీయ ఆరోపణల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 2లో..

# సుప్రీంకోర్టు జడ్జిగా సీజే అపరేశ్ కుమార్ సింగ్

- మరో ఇద్దరి నియామకానికి గ్రీన్ సిగ్నల్
- కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం
- 37కు చేరనున్న సుప్రీం న్యాయమూర్తుల సంఖ్య



హైదరాబాద్, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయనతో పాటు గుజరాత్ హైకోర్టు సీజే జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయల నియామకానికి కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సోమవారం

మిగతా 2లో..

# ఫ్రాన్సిస్ హాల్జన్‌కు ఫిజిక్స్‌లో నోబెల్

- బెల్జియం శాస్త్రవేత్తకు అత్యున్నత పురస్కారం
- ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటు

న్యూఢిల్లీ, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతికి ఈ ఏడాది ప్రఖ్యాత శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ ఎంపికయ్యారు. ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటుకు అందించిన విశేష సేవలతో పాటు ఖగోళ మూలాలు కలిగిన అత్యుత్తమ శక్తివంతమైన న్యూట్రినోలను కనుగొన్నందుకు ఫ్రాన్సిస్ హాల్జెన్ ఈ



పురస్కారాన్ని గెలుచుకున్నారు. స్టాక్‌హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో విజేత పేరును అకాడమీ అధికారికంగా వెల్లడించింది. ఈ ఏడాది నోబెల్ బహుమతి నగదు బహుమానం 1.2 మిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉంది. ఫ్రాన్సిస్ హాల్జెన్ అంతర్జాతీయ పరిశోధకులు, ఇంజినీర్ల బృందానికి

మిగతా 2లో..



# సర్‌పై యుద్ధం!!

- ఈసీ కార్యాలయం ముందు మార్చ్
- విపక్షాల 'సేవ్ డెమొక్రసీ' పాదయాత్ర
- జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఆకాశవాణి భవన్ వద్ద హైటెన్షన్ వాతావరణం
- రాహుల్‌గాంధీ సహా పలువురు నేతల అరెస్ట్..!
- పోలీసుల అదుపులో కాంగ్రెస్ నేతలు
- పలు ప్రాంతాల్లో ఇంటర్నెట్ నిలిపివేత

న్యూఢిల్లీ, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన ప్రతిపక్ష నేతలను ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో మంగళవారం (అక్టోబర్ 06) ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయం వైపు మార్చ్ చేపట్టారు. పోలీసులు బ్యారికేడ్లు ఏర్పాటు చేసి మార్చ్‌ను అడ్డుకున్నారు. దీంతో పలువురు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు

మిగతా 2లో..

### ముగ్గురు చేసింది దేశద్రోహమే

- మోదీ, షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారు
- ఈ విషయం దేశంమొత్తానికి తెలిసిపోయింది
- మేం రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రయత్నిస్తున్నాం
- ఎంపీలతో మాట్లాడటానికి ఈసీకి అభ్యంతరం ఏంటి?
- ఈసీ కమిషనర్లు మమ్మల్ని ఎందుకు కలవడం లేదు?
- పోలీసులు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు?
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా ఖచ్చితంగా చేయాల్సిందే
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): ప్రధాని మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ నలుగురూ కలిసి దేశానికి వ్యతిరేకంగా 'ఓటు చోరీ' కుట్రకు పాల్పడ్డారని, ఇది ముమ్మాటికీ 'దేశద్రోహం' అని

మిగతా 2లో..

# 45 ఎకరాలపై తేల్చండి

- 2 గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ ఇవ్వండి
- వెంటనే రెవెన్యూ రికార్డులు సమర్పించాలి
- మరవీరుల కుటుంబాలకై కాలనీ నిర్మించాలి
- హౌసింగ్ బోర్డుకు బాధ్యతలు అప్పగించాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ సమీక్ష..
- కేసీఆర్ కుటుంబానికి నోటీసులకు సన్నద్ధం!



హైదరాబాద్, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల పరిధిలోని భూముల వ్యవహారం మరోసారి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రికార్డుల ప్రకారం ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాల భూమి ఉండగా.. క్షేత్రస్థాయి సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. దీంతో మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడ ఉందో తేల్చాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. భూముల సరిహద్దులు, రెవెన్యూ రికార్డుల పరిశీలన కోసం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో సర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325 భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో అధికారులు చేపట్టిన భూ సర్వే

మిగతా 2లో..

### ప్రభుత్వ అధినేతగా మోదీకి 25ఏళ్లు

- మోదీని ప్రశంసించిన కేబినెట్
- కీలక ప్రతిపాదనలకు ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్య చరిత్రలో అరుదైన మైలురాయి నమోదైంది. గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా 25 ఏళ్ల నిరంతర నాయకత్వ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేంద్ర మంత్రివర్గం ఘనంగా అభినందనలు తెలిపింది. ప్రధాని మోదీ ప్రయాణం



మిగతా 2లో..

### తెలంగాణలో కరవు పరిస్థితులు..

- 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం
- సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి
- సీఎస్ సంజయ్ జజూ వెల్లడి
- ఎల్ నినోపై ప్రాథమిక అంచనా
- కరవుపై అఖిలపక్ష సమావేశం!?



హైదరాబాద్, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళనకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని 18 జిల్లాల్లో గల 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా

మిగతా 12లో..

# దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ కమ్యూనిటీ కిచెన్



- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం
- సుమారు రూ.9.60 కోట్లతో వంటశాల నిర్మాణం
- 60 వేల మంది విద్యార్థులకు నిత్యం అల్పాహారం
- ప్రాజెక్టుకు నిధులు సమకూర్చిన సింగరేణి సంస్థ
- సూర్యాపేట జిల్లాలో నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్

సూర్యాపేట, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఎస్ఎం పేట సమీపంలో అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.9.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 1029 స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లోని దాదాపు 60 వేల మంది విద్యార్థులకు రోజూ అల్పాహారం అందించనున్నారు. మునగాల మండలంలో నేషనల్ హైవేకి సమీపంలో ఎంపిక చేసిన స్థలంలో ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారాన్ని తయారు చేసి.. ప్యాకింగ్ చేసి, నిర్ణీత సమయానికి

మిగతా 12లో..

### మేజర్ అయిన కుమార్తెను బలవంతం చేయలేరు

- తమతోనే ఉండమని తల్లిదండ్రులు ఇబ్బంది పెట్టొద్దు
- 25 ఏళ్ల కుమార్తెకు ఇష్టానుసారం జీవించే హక్కు ఉంది
- 'హెబియస్ కార్పస్' పిటిషన్
- అలహాబాద్ హైకోర్టు తీర్పు

అలహాబాద్, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): మేజర్ అయిన కుమార్తెను ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా తమతో కలిసి జీవించేలా తలిదండ్రులు బలవంతం చేయలేరని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. వయోజనురాలైన కుమార్తెను బలవంతంగా తమతో ఉంచుకోవడానికి 'హెబియస్ కార్పస్' పిటిషన్‌ను ఆశ్రయించడానికి వీలులేదని పేర్కొంది. మేజరైన వ్యక్తి స్వయం నిర్ణయాధికారం కలిగి ఉంటారని, వారిని ఎవరి ఇష్టానుసారమో బలవంతంగా నివసించేలా కట్టడి

మిగతా 12లో..

### ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం..

- నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారని నిర్ధారణ
- 35 మంది జూనియర్ లెక్చరర్ల తొలగింపు

హైదరాబాద్, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి): తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు

మిగతా 12లో..

# సంపాదకీయం

## సర్వే పై సర్వత్రా నిరసనలు!

సర్ రేపిన ప్రకంపనలు అంతా ఇంతా కాదు. ప్రక్రియలో ఏర్పడిన లోపాలను ఎత్తి చూపుతూ ప్రతిపక్షాలు విమర్శలు చేస్తూనే దేశ వ్యాప్తంగా నిరసనలతో హోరెత్తిస్తున్నాయి. ఇక సర్వేపై సర్వత్రా స్తబ్దత ఏర్పడి విమర్శకులకు సరికొత్త ఆయుధాన్ని అందించింది. ఆ శూన్యతలో దేశదేశాల్లో తీవ్ర జాతీయవాదం ముసుగుతో కార్పొరేట్ ఆధిపత్యానికి కొమ్ముకాసే తిరోగామి ప్రభుత్వాలు పుట్టుకు వచ్చాయి. ఊకదంపుడు ఉపన్యాసాల సాంప్రదాయిక రాజకీయ యంత్రాంగాలు అలసి సొలసి మూలకు చేరాయి. ఇక్కడే.. ఈ శూన్యంలో నుంచే పుట్టిన బొద్దింకలు బిలబిలమంటూ బయటకు వస్తున్నాయి. తమకు ఎదురే లేదని విర్రవీగే నిరంకుశ ప్రభుత్వాలకు దడ పుట్టిస్తున్నాయి. చెమటలు పట్టిస్తున్నాయి. ఓ వైపు మనదేశంలో కేంద్రమంత్రిని గద్దె దించగలిగిన విద్యార్థి కిశోరాలు ఇప్పుడు వివాదాస్పద సీఈసీని ఇంటికి పంపేందుకు కదం తొక్కుతుండటం మనం చూస్తున్నాం. ఇదే తరహాలో తాజాగా ప్యారిస్‌లోనూ యువజనులు వీధుల్లోకి వచ్చి ఫ్రెంచ్ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. రాజధాని ప్యారిస్ మొదలుకుని అన్ని చిన్నాపెద్దా నగరాలు ప్రదర్శనలు, ఊరేగింపులతో దద్దరిల్లుతున్నాయి. ఫ్రాన్స్‌లో విద్యారంగ సంక్షోభం యు వత ఆగ్రహానికి ప్రధాన కారణం. పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో తరగతి గదులు కిక్కిరిసిపోవడం, ఉపాధ్యాయులు, సిబ్బంది కొరత, పైకప్పులు కారడం, భవనాలు దెబ్బతినడం వంటి మౌలిక సమస్యలు విద్యార్థుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తున్నాయి. ఇది భారత్‌లో సీజేపీ చేపట్టిన బడుల సంస్కరణ ఆందోళన ఈ సందర్భంగా మనకు సహజంగానే గుర్తుకురాక మానదు. అయితే ఫ్రాన్స్‌లో ఆందోళనలు కేవలం విద్యార్థి యువజనులకే పరిమితం కాలేదు. అటు పబ్లిక్‌రంగ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది, సివిల్ సర్వెంట్లు కూడా వీధుల్లోకి వచ్చి జీతాలు, ధరల పెరుగుదలపై ఉద్యమిస్తున్నారు. ఇంకా పోలీసులకు స్వీయరక్షణ పేరుతో కర్కశ అధికారాలు కట్టబెట్టేందుకు చట్టపరంగా జరిగిన ప్రయత్నం పెద్ద ఎత్తున వ్యతిరేకతకు దారితీసింది. విమర్శకులు దీనిని 'లైసెన్స్ టు కిల్'గా అభివర్ణిస్తున్నారు. మరో యూరప్ దేశమైన స్పెయిన్‌లో గృహ సంక్షోభం చిలికిచిలికి గాలివానగా మారి మధ్యంతర ఎన్నికలకు దారితీయడం ప్రజోద్యమాల పరంపర దావానలంలా వ్యాపించడానికి మరో ఉదాహరణగా నిలుస్తున్నది. ఇండ్ల అద్దెలు తగ్గించేందుకు పెడ్రో సాంచెజ్ నేతృత్వంలోని సోషలిస్టు ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం పార్లమెంటులో మితవాద పార్టీల సహాయ నిరాకరణ వల్ల వీగిపోవడంతో సంక్షోభం తీవ్రమైంది. ఓ వృద్ధురాలిని ఇంటి నుంచి ఖాళీ చేయించడంపై పెల్లుబికిన ప్రజాగ్రహం సార్వత్రిక సమ్మెకు పిలుపు నివ్వడం వరకు పోవడం గమనార్హం. అమెరికా నుంచి యూరప్ వరకు, ఆసియా నుంచి ఆఫ్రికా వరకు యువత వీధుల్లోకి రావడం అనేది ఒక ధోరణిగా ముందుకు వస్తుండటం కనిపిస్తున్నది. ఈ తరహా ప్రజా నిరసనలు సామాజిక అసమానతలు, నిరుద్యోగం వంటి సమస్యల సమిష్టి ఫలితంగా ఉద్భవించాయి. లోతుగా పరిశీలిస్తే, వీటివెనుక యువతకు వ్యవస్థలపై నమ్మకం క్షీణించడం ప్రధాన కారణంగా వ్యక్తమవుతున్నది. యువతలో ఈ ఆగ్రహానికి ముఖ్య కారణం భవిష్యత్తుపై అనిశ్చితి. వాతావరణ మార్పులు, యుద్ధాలు, ఆర్థిక అస్థిరత అన్నీ కలిసి ఒక నిరాశాజనక దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. తమ భవిష్యత్తు సురక్షితం కాదనే భావన యువతను తీవ్రంగా వేధిస్తున్నది. విద్య పూర్తయ్యాక ఉద్యోగ భద్రత లేకపోవడం, జీవన వ్యయం పెరగడం, అవకాశాలు కొద్దిమందికే పరిమితమవడం వంటి అంశాలు యువతను ఆవేదనకు గురిచేస్తున్నాయి. సంప్రదాయ రాజకీయాలు ప్రజల సమస్యలకు సమాధానం ఇవ్వలేకపోతున్నాయనే భావన క్రమంగా బలపడుతున్నది. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం యువతలో అసహనాన్ని పెంచుతున్నది. ఫలితంగా, రాజకీయ పార్టీలు, నాయకులను పక్కన పెడుతూ, ప్రజలే నేరుగా వీధుల్లోకి వచ్చి తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇందులో యువత అగ్రగామిగా నిలువడం సహజంగానే జరుగుతున్నది. ఈ ఆందోళనలను ప్రజాస్వామ్యానికి ఒక హెచ్చరికగా చూడాలి. ప్రభుత్వాలు కేవలం నియంత్రణ చర్యలతో కాకుండా, మూల కారణాలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. కొత్తతరం స్వరం మారుతున్నది. ఆ స్వరాన్ని వినడం, అర్థం చేసుకోవడం, సరైన మార్పులు తీసుకురావడం ప్రభుత్వాల బాధ్యత. లేకపోతే, కాక్రోచ్ ఫినామెనా మరింతగా విజృంభించి, సంప్రదాయ రాజకీయ వ్యవస్థల పతనానికి, తద్వారా అరాచకత్వానికి దారితీసే ప్రమాదమున్నదని గుర్తుంచుకోవాలి. అసలు సర్ పై నెలకొన్న ఈ స్తబ్దతపై ఎప్పుడు స్పష్టత వస్తుందోనని అనదరూ ఉత్కంటగా ఎదురు చూస్తున్నారు.

## 45 ఎకరాలపై తేల్చండి

మొదటిపేజీ తరువాయి..

వివరాలను పరిశీలించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల మేరకు మొత్తం 388 ఎకరాల భూమి ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు సమాచారం. రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, సర్వేలో గుర్తించిన భూమికి మధ్య 45 ఎకరాల తేడా రావడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. 45 ఎకరాల భూమి తేడా రావడానికి కారణాలు ఏంటి.. భూమి సరిహద్దుల గుర్తింపులో ఏవైనా సమస్యలు ఉన్నాయా.. రెవెన్యూ రికార్డుల్లో ఏవైనా తప్పులు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించి, పూర్తి వివరాలు అందించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎర్రవల్లి, దాని సమీపంలోని వెంకటాపురం గ్రామాల్లో భూముల సర్వేను పూర్తి చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. భూముల సరిహద్దులకు ఆనుకుని ఉన్న మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల నుంచి సంబంధిత రెవెన్యూ రికార్డులు సమర్పించాలని అధికారులు నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. సర్వే నంబర్ 325కు సంబంధించిన భూములపై పూర్తి స్థాయి పరిశీలన జరిపి.. రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. సర్వే నంబర్ 325లోని భూముల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో కీలక ఆదేశం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. ఈ కాలనీలో అర్హులైన అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు.. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని సూచించినట్లు సమాచారం. జూన్ 2వ తేదీలోగా అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే సర్వే నంబర్ 325లోని భూముల గుర్తింపు పూర్తయిన తర్వాత అర్హులైన స్థానిక రైతులకు భూముల పంపిణీ చేసే అంశాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ రికార్డులు, భూముల పాత సర్వే వివరాలు, ప్రస్తుత స్వాధీన పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడం ద్వారా విస్తీర్ణంలో తేడాకు కారణం తేలే అవకాశం ఉంది. అనంతరం చట్టబద్ధమైన ప్రక్రియ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తదుపరి నిర్ణయాలు తీసుకోనుంది. మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలోని భూములపై గతంలోనూ రాజకీయ చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో సర్వే నంబర్ 325లో విస్తీర్ణానికి సంబంధించి వచ్చిన తాజా వివరాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భూముల రికార్డులు కోరడం, సర్వే నోటిఫికేషన్ విడుదల, అమరవీరుల కాలనీ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు తదుపరి పరిణామాలపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని పెంచుతున్నాయి.

## భారత వైమానిక దళానికి కొత్త అధిపతి

మొదటిపేజీ తరువాయి..

ఆయన భారత వైమానిక దళానికి 29వ అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ హోదాలో బాధ్యతలు చేపట్టనున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సేవా అనుభవం ఉన్న అశుతోష్ దీక్షిత్ ఫైటర్ పైలట్. 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ స్ట్రీమ్‌లో చేరిన ఆయన.. ప్రయోగాత్మక టెస్ట్ పైలట్, క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా సేవలందించారు. ఇప్పటివరకు 3,500 గంటలకు పైగా విమాన ప్రయాణ అనుభవం ఆయనకు ఉంది. మిరాజ్-2000, వివిధ మిగ్ వేరియంట్లు, జాగ్వార్, కిరణ్, హాక్, ఐఎల్-78, తేజస్ తదితర విమానాలను నడిపారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, కోప్ ఇండియా, ఆపరేషన్ సిందూర్ వంటి కీలక ఆపరేషన్లు, విన్యాసాల్లో దీక్షిత్ పాల్గొన్నారు. మిరాజ్-2000 స్క్వాడ్రన్‌తో పాటు పశ్చిమ రంగంలోని ఫ్రంట్‌లైన్ ఫైటర్ బేస్, దక్షిణ రంగంలోని ఫైటర్ ట్రైనింగ్ బేస్‌కు కమాండర్‌గా పనిచేశారు. అంతేకాదు కేంద్ర ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా, చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2026 జూలైలో వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. తేజస్ సహా స్వదేశీ విమాన ప్రాజెక్టులు, వైమానిక దళ ఆధునికీకరణలోనూ ఆయనకు కీలక అనుభవం ఉంది. దీక్షిత్ సేవలకు గుర్తింపుగా 2006లో వాయుసేన పతకం, 2011లో విశిష్ట సేవా పతకం, 2023లో అతి విశిష్ట సేవా పతకం, 2026లో పరమ విశిష్ట సేవా పతకం లభించాయి.



## ఫ్రాన్సిస్ హాల్జన్‌కు ఫిజిక్స్‌లో నోబెల్

మొదటిపేజీ తరువాయి..

నాయకత్వం వహించి ప్రపంచానికి అద్భుతమైన పరికరాన్ని అందించారని, ఆయన పట్టుదల, శాస్త్రీయ దృక్పథం సరికొత్త ఖగోళ శాస్త్రానికి బాటలు వేశాయని నోబెల్ ఫిజిక్స్ కమిటీ ఛైర్మన్ మార్క్ పియర్స్ కొనియాడారు. బెల్జియంలో జన్మించిన 82 ఏళ్ల శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ అమెరికాలోని విస్కాన్సిన్-మాడిసన్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్నారు. తాను నోబెల్ బహుమతి గెలుస్తానని ముందే అంచనా వేసినప్పటికీ, ఈ ప్రకటన తనకు ఇంకా వింతగా అనిపించిందని హాల్జెన్ చెప్పారు. న్యూట్రినోలను భూత కణాలు (ఘోస్ట్ పార్టికల్స్)గా భావిస్తుంటారు. ఇవి మన చుట్టే తిరుగుతుంటాయి. న్యూట్రినోలు అనేవి ఊహించలేనంత చిన్న ద్రవ్యరాశి కలిగిన సూక్ష్మమైన విశ్వ కణాలు. అయినప్పటికీ అవి ప్రతిచోటా ఉన్నాయి. అవి సూర్యుని వంటి నక్షత్రాల నుంచి వెలువడతాయి. ప్రతి సెకనుకు లక్షల కోట్ల కణాలు మన శరీరాల గుండా దూసుకుపోతాయి. వీటిని గుర్తించడం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఈ రేణువులకు ద్రవ్యరాశి గానీ విద్యుదావేశం గానీ ఉండవు. ఇతర రేణువులతో ఢీకొట్టటమూ అంతంతే. ఈ కణాలను గుర్తించేందుకు దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచును ఉపయోగించవచ్చని ఫ్రాన్సిస్ హాల్జెన్ కనుగొన్నారు. మంచు, కాంతి సెన్సార్లతో కూడిన ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారు. గతేడాది సబ్ అటామిక్ కణాల వింత ప్రవర్తనపై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు భౌతికశాస్త్ర నోబెల్ లభించింది. వారి క్వాంటం టన్నెలింగ్ పరిశోధనల వల్లే ఎంఆర్ఐ మెషీన్లలో అత్యంత సున్నితమైన కొలతలు సాధ్యమయ్యాయి. మెరుగైన సెల్‌ఫోన్లు, వేగవంతమైన కంప్యూటర్ల తయారీకి అది పునాది వేసింది. ఇప్పటికే 2026 నోబెల్ ప్రకటనల్లో భాగంగా వైద్యశాస్త్ర పురస్కారాన్ని ప్రకటించారు. కాంతి ద్వారా జీవకణాల్లోని అయాన్ ఛానెళ్లను నియంత్రించే పద్ధతులు, నాడి వ్యవస్థ కణాల పనితీరును అధ్యయనం చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ పురస్కారం దక్కింది. ఆప్టోజెనెటిక్స్ రంగంలో చేసిన పరిశోధనలకు గాను అమెరికాకు చెందిన కార్ల్ డిసెరోథ్, జర్మనీకి చెందిన పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌లను నోబెల్ కమిటీ సోమవారం విజేతలుగా ప్రకటించింది. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఆ ప్రకటన వెలువడింది. ఇక 2026 నోబెల్ ప్రకటనల్లో భాగంగా బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య పురస్కారాలను ప్రకటించనున్నారు. శుక్రవారం శాంతి నోబెల్, అక్టోబర్ 12న ఆర్థికశాస్త్రంలో నోబెల్ విజేతలను వెల్లడించనున్నారు.

స్వీడన్‌కు చెందిన దిగ్గజ రసాయన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త అయిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్‌కు గుర్తుగా ఏటా డిసెంబర్ 10న ఈ పురస్కారాలు అందిస్తారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని నోబెల్ కమిటీ ఇందుకు ఎంపిక చేస్తుంది. వాస్తవానికి ఆల్‌ఫ్రెడ్ నోబెల్ జీవిత చరమాంకంలో ఒక వీలునామా రాశారు. అందులో తన జ్ఞాపకార్థం, మానవాళికి గొప్ప ప్రయోజనం చేకూర్చినవారికి నోబెల్ బహుమతి ఇవ్వాలని సూచించారు. ఇందుకోసం తన సంపద మొత్తాన్ని కేటాయించారు. దీనితో 1900 సంవత్సరం జూన్ 29న నోబెల్ ఫౌండేషన్ ఏర్పాటైంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ చనిపోయే సమయానికి, నోబెల్ ఫౌండేషన్ పరిధిలోని ఆయన ఆస్తుల విలువ రూ.29.34 కోట్లు. 2024 సంవత్సరం వచ్చేసరికి ఆయన సంపదల విలువ బాగా పెరిగిపోయి ఏకంగా రూ.2,300 కోట్లకు చేరడం విశేషం.

## సుప్రీంకోర్టు జడ్జిగా సీజే అపరేశ్ కుమార్ సింగ్



మొదటిపేజీ తరువాయి..

నోటిఫికేషన్ జారీ చేసింది. సుప్రీంకోర్టు కొలీజియం సెప్టెంబర్ 28న చేసిన సిఫార్సుల మేరకు ఈ నియామకాలు జరిగాయి. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ కొత్త నియామకాలతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరుకోనుంది. సుప్రీంకోర్టు సవరణ చట్టం-2026 ప్రకారం, ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం ఆమోదిత సంఖ్య 38 కాగా, ప్రస్తుతం 34 మంది ఉన్నారు. ఈ ముగ్గురి ప్రమాణ స్వీకారంతో ఈ సంఖ్య 37కు పెరుగుతుంది. 1965 జులై 7న జన్మించిన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1990లో పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా తన వృత్తిని ప్రారంభించారు. అనంతరం ఝార్ఖండ్ హైకోర్టులో ప్రాక్టీస్ చేసి, 2012లో అదే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014లో శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఝార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కూడా సేవలు అందించారు. ఆ తర్వాత త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి, ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక, జస్టిస్ సునీతా అగర్వాల్ నియామకంతో సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య మూడుకు పెరగడం గమనార్హం. త్వరలోనే ఈ ముగ్గురు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## సర్‌పై యుద్ధం!!

మొదటిపేజీ తరువాయి..

నేతలలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ నేతలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ఢిల్లీలో ఉద్రిక్తంగా మారింది. మంగళవారం (అక్టోబర్ 6) పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వరకు 300 మందికి పైగా ప్రతిపక్ష ఎంపీలు పాదయాత్ర చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్



రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పోలీసులు, నిరసనకారుల మధ్య పలుచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల సంఘం కార్యాలయంలోకి ప్రతిపక్ష నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎన్నికల సంఘం గేటు వద్దకు చేరుకున్న కొందరు కార్యకర్తలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. ప్రాంతంలో సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఎన్నికల సంఘానికి సుమారు 100 మీటర్ల దూరంలోని ఆకాశవాణి కాంప్లెక్స్ వద్ద రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు ధర్నాకు కూర్చున్నారు. అనంతరం పోలీసులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను కూడా పోలీసులు బస్సుల్లో అక్కడి నుంచి తరలించారు. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అధికారికంగా లేఖ పంపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఒకటి రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని ఎన్నికల సంఘం నుంచి హామీ వస్తే నిరసనను విరమించే అంశాన్ని రాహుల్ గాంధీ పరిశీలించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే 300 మంది ఎంపీలతో కలిసి ఎన్నికల సంఘాన్ని కలవాలన్నది రాహుల్ ప్రధాన డిమాండ్‌గా ఉన్నట్లు సమాచారం.

## ముగ్గురు చేసింది దేశద్రోహమే

మొదటిపేజీ తరువాయి..

స్పష్టం చేశారు. భవిష్యత్తులో వీరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం తథ్యమని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా మంగళవారం ఇండీ కూటమి ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కదం తొక్కారు. పార్లమెంట్ భవనం నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు 300 మంది ర్యాలీగా వెళ్లారు. అయితే ఆకాశ్ వాణి భవన్, నీతి ఆయోగ్ కార్యాలయాల సమీపంలో భద్రతా సిబ్బంది రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర ఎంపీలను అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఆకాశ్ వాణి భవన్ కాంప్లెక్స్ లోపల బైఠాయించిన విపక్ష నేతలు అక్కడి నుంచే తమ నిరసన తెలిపారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు. ఈ విషయం దేశంమొత్తానికి తెలుసు. కానీ మేం రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రయత్నిస్తున్నాం. కొద్దిసేపటి క్రితం దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లను కలవడానికి నిర్వచన్ సదన్(ఎన్నికల ప్రధాన కార్యాలయం) వైపు వెళ్లాం. అయితే, ఈసీ కార్యాలయానికి కేవలం 50 గజాల దూరంలో పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. నాకు అర్థం కాని విషయం ఏంటంటే, కోట్లాది మంది ప్రజలు ఓట్లేసి గెలిపించిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో మాట్లాడటానికి ఈసీకి ఉన్న అభ్యంతరం ఏంటి? ఎన్నికల కమిషనర్లు మమ్మల్ని ఎందుకు కలవడం లేదు? పోలీసులు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు? ప్రజల గొంతుకగా వచ్చిన ఎంపీలను కలవడానికే సీఈసీ నిరాకరిస్తే దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టిన ఆయన "జ్ఞానేశ్ కుమార్, ఇక చాలు బ్రో. రాజీనామా చేసే సమయం ఆసన్నమైంది" అని అన్నారు. ఢిల్లీలో సేవ్ డెమోక్రసీ పేరుతో విపక్ష ఎంపీలు ర్యాలీ చేస్తున్న సమయంలోనే రాహుల్ ఈ పోస్టు చేయడం గమనార్హం. భారీ భద్రత నడుమ ప్రతిపక్ష ఎంపీలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారని సీపీఐ ఎంపీ పి సందోశ్ కుమార్ పేర్కొన్నారు. సీఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్, ఇతర బలగాలతో భద్రతా సిబ్బందిని భారీగా మోహరించి సీఈసీ ప్రధాన కార్యాలయం వైపు వెళ్లకుండా నిలువరించారని చెప్పారు. మరోవైపు, విపక్షాల పాదయాత్రను అడ్డుకున్న తర్వాత, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓ బ్రియన్‌తో సహా పలువురు ప్రతిపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే అరెస్టులు తమ సమస్యకు పరిష్కారం కాదని, సీఈసీ రాజీనామా చేయాల్సిందేనని విపక్ష నేతలు స్పష్టం చేశారు. అంతవరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ అధినేతగా మోదీకి 25ఏళ్లు

మొదటిపేజీ తరువాయి..

కేవలం పదవుల రికార్డు మాత్రమే కాదని.. నేషన్ ఫస్ట్ -- సిటిజన్ ఫస్ట్ అనే సిద్ధాంతానికి నిలువెత్తు నిదర్శనమని కేబినెట్ ప్రశంసించింది. గుజరాత్‌లో మూడు వరుస విజయాలు, దేశవ్యాప్తంగా మూడు వరుస లోక్‌సభ ఎన్నికల్లో దక్కిన అఖండ ప్రజాదరణే ఆయన నాయకత్వంపై ప్రజలకున్న తిరుగులేని విశ్వాసానికి ప్రతీక అని పేర్కొంటూ కేంద్ర మంత్రివర్గం ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి దేశ ప్రధాని వరకు మోదీ సాగించిన పాలనా ప్రయాణాన్ని, సాధించిన అద్భుత విజయాలను ప్రతిబింబించే 10 కీలక అంశాలను ఈ తీర్మానంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గుజరాత్‌లో విజయవంతమైన పరిపాలనా విధానాలను ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా అమలు చేశారు. ప్రజల సమస్యలను స్వయంగా వినే స్వాగత్ కార్యక్రమం 2010లో ఐక్యరాజ్యసమితి పబ్లిక్ సర్వీస్ అవార్డును గెలుచుకోగా.. అదే స్ఫూర్తితో కేంద్రంలో ప్రగతి వేదికను ఏర్పాటు చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను సమీక్షించి, వేగవంతం చేయడానికి ఇది కీలక సాధనంగా మారింది. గుజరాత్‌లో వ్యవసాయానికి ప్రత్యేక విద్యుత్ అందించిన జ్యోతిగ్రామ్ తరహా విధానం దేశవ్యాప్తంగా సాగు రంగానికి మార్గదర్శకంగా నిలిచింది. పేదరికాన్ని స్వయంగా చూసి ఎదిగిన నేపథ్యం నుంచి వచ్చిన ప్రధాని మోదీ, ఆ అనుభవాన్ని ప్రజా సంక్షేమ పథకాలుగా మలిచారు. 60 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు, 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లు, 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటం వంటి చరిత్రాత్మక విజయాలు సామాన్యుల జీవితాల్లో ఆత్మగౌరవాన్ని నింపాయి. సమాజంలోని అన్ని వర్గాలను అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పాలన సాగింది. 3.5 కోట్ల మంది మహిళలు లక్షాధికారులుగా మారగా, నారీ శక్తి వందన్ అధినియమం ద్వారా మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించారు. పీఎం-కిసాన్ ద్వారా అన్నదాతల ఖాతాల్లోకి రూ.4 లక్షల కోట్లకు పైగా నిధులు చేరాయి. స్టార్టప్‌లు, విద్యా సంస్కరణలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించగా, అత్యంత వెనుకబడిన గిరిజన ప్రాంతాల కోసం పీఎం-జన్‌మన్ కార్యక్రమం బాసటగా నిలిచింది. ఎలాంటి రాజకీయ నష్ట భయాలు లేకుండా దేశ ప్రయోజనాల కోసం సాహసోపేత సంస్కరణలు చేపట్టారు. జీఎస్టీ, సంక్షేమ ఫలాల ప్రత్యక్ష బదిలీ, వలస పాలన నాటి పాత చట్టాల రద్దు వంటివి పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. స్వచ్ఛ భారత్, డిజిటల్ చెల్లింపులు, 'వోకల్ ఫర్ లోకల్' వంటి పిలుపుల ద్వారా ప్రజలను ఈ మార్పులో భాగస్వాములను చేశారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వ మూలధన వ్యయం రూ.2 లక్షల కోట్ల నుంచి ఏకంగా రూ.12 లక్షల కోట్లకు పైగా పెరిగింది. హైవేల విస్తరణ, రైల్వేల విద్యుదీకరణ వేగవంతమయ్యాయి. దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.13 లక్షల కోట్లకు చేరింది. రక్షణ రంగ ఉత్పత్తులు, సెమీకండక్టర్ల తయారీలో భారత్ స్వావలంబన సాధించింది. సాంకేతికతను సామాన్యుడి సేవకు సాధనంగా మార్చారు. జన్ ధన్, ఆధార్, మొబైల్ అనుసంధానంతో పాటు యూపీఐ డిజిటల్ చెల్లింపులు సామాన్యుల జీవనాన్ని సులభతరం చేశాయి. స్వదేశీ కొవిడ్ వ్యాక్సిన్ల అభివృద్ధి, చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 అడుగుపెట్టడం ప్రధాని మోదీ దార్శనికతకు నిదర్శనాలు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం, ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీతో భారత్ అగ్రగామిగా ఎదుగుతోంది. కరోనా మహమ్మారి సంక్షోభం వేళ దేశాన్ని ఏకతాటిపైకి నడిపించి, స్వదేశీ వ్యాక్సిన్లతో అతిపెద్ద వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. పశ్చిమాసియా సంక్షోభం వంటి అంతర్జాతీయ సవాళ్లు ఎదురైనప్పుడు సమయోచిత నిర్ణయాలు, ఇంధన భద్రతా చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా స్థిరమైన రక్షణ కల్పించారు. 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్, 2025 ఆపరేషన్ సిందూర్ ద్వారా జాతీయ భద్రతపై రాజీలేని స్పష్టమైన వైఖరిని ప్రధాని చాటారు. ఆర్టికల్ 370 రద్దు, వన్ ర్యాంక్ వన్ పెన్షన్ అమలు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ పదవి ఏర్పాటు కీలక మైలురాళ్లుగా నిలిచాయి. మావోయిస్టు సమస్యను అదుపు చేయడం, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి ఒప్పందాలు దేశానికి స్థిరత్వాన్ని తెచ్చాయి.

## కేసీఆర్, రేవంత్ కుటుంబాల ఆస్తులపై విచారణ జరపండి

మొదటిపేజీ తరువాయి..

సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆరోపిస్తుండగా.. వాటికి బీఆర్ఎస్ కౌంటర్ ఇస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ గులాబీ నేతలు ప్రతివిమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్, రేవంత్ రెడ్డి కుటుంబాలకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ బీజేపీ కూడా మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ వివాదంలోకి బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కూడా ఎంట్రీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన ఆస్తులపై సమగ్ర విచారణ జరిపించాలని రఘునందన్ రావు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై మరొకరు చేస్తున్న ఆస్తుల ఆరోపణల్లో నిజానిజాలను వెలికితీయాలని కోరారు. ఈ ఫిర్యాదును ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)గా లేదా విచారణకు సంబంధించిన ఇతర తగిన రూపంలో స్వీకరించాలని హైకోర్టు జస్టిస్‌ను విజ్ఞప్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్‌తో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలపై స్వతంత్రంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని రఘునందన్ రావు పేర్కొన్నారు. అక్టోబర్ 2వ తేదీన తాను చేసిన ప్రకటనకు అనుగుణంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. పత్రికల్లో ప్రచురితమైన కథనాలు, ఆరోపణలకు సంబంధించిన వివరాలను సేకరించి, అవసరమైన పత్రాలను ఫిర్యాదుకు జతచేసినట్లు చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నప్పటికీ.. వాటిపై న్యాయపరమైన విచారణ కోరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. అందుకే తానే నేరుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆశ్రయించినట్లు వివరించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల రూపాయలు దోచుకుందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారని పేర్కొన్న రఘునందన్ రావు.. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రూ.50 వేల కోట్లు సంపాదించారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని కోరారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులతో పాటు, వాటికి మించి ఇతర ఆస్తులు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఆరోపణలు నిజమా కాదా అన్నది న్యాయ విచారణ ద్వారానే తేలాలని.. ప్రజలకు వాస్తవాలు తెలియాలని రఘునందన్ రావు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించి ప్రతిపక్ష నేతలు ప్రస్తావిస్తున్న మెడికవర్ ఆస్పత్రి, స్కూళ్లు, ఇతర వ్యాపారాలకు సంబంధించిన ఆరోపణలపైనా నిజానిజాలు బయటపడాల్సిన అవసరం ఉందని రఘునందన్ రావు పేర్కొన్నారు. అక్రమంగా సంపాదించినట్లు నిర్ధారణ అయిన సొమ్మును తిరిగి ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా తాను ఫిర్యాదును తపాలా ద్వారా పంపించనున్నట్లు రఘునందన్ రావు తెలిపారు. ఆస్తుల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సమయంలో రఘునందన్ రావు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## క్లోజర్ స్పేసింగ్‌తో పత్తి సాగు.. రైతులకు శాస్త్రవేత్తల అవగాహన





**నేరడిగొండ, అక్టోబర్ 06 (ప్రజాజ్యోతి) :** మండలంలోని బుగ్గారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'క్లోజర్ స్పేసింగ్' పద్ధతిలో పత్తి సాగు యాజమాన్యంపై రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ డి. మోహన్ దాస్, మండల వ్యవసాయ అధికారిణి కె. కృష్ణవేణి, ఏఈఓ వంశీ, గ్రామ సర్పంచ్ రాథోడ్ కృష్ణ, ఉప సర్పంచ్ జల్పథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ డి.మోహన్ దాస్ మాట్లాడుతూ.. క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో 90 ఐ 30 సెంటీమీటర్ల దూరంలో పత్తి విత్తనాలు విత్తుకోవడం ద్వారా ఎకరాకు మొక్కల సాంద్రత పెంచుకోవచ్చని తెలిపారు. దీంతో పంట పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడి, సాగు యాజమాన్యాన్ని శాస్త్రీయ పద్ధతిలో చేపట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో పాటించాల్సిన సరైన విత్తన మోతాదు, విత్తే విధానం, పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. పత్తి సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా మెరుగైన పంట దిగుబడికి కృషి చేయాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో 40 మందికి పైగా రైతులు పాల్గొని క్లోజర్ స్పేసింగ్ పద్ధతిపై తమ సందేహాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు

- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం
- కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



**ఆసిఫాబాద్ అక్టోబర్ 6 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో వాంకిడి మండలంలోని ఆకిని, సరండీ, ఖమాన్ గ్రామా లకు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం లో సుగుణక్క వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నూతన సభ్యులు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సుగుణక్క సూచించారు. పార్టీలో చేరిన వారిలో మొర్లే నాందేవ్, ఆడే నీలాబాయి, దుర్గం అన్నారావు, కొట్రంగే కవిత, పెట్కులే దాము, గోపాల్, శంకర్, సంతోష్, జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు తారిక్, భీంరావ్, మండల అధ్యక్షుడు గూర్నూలే మెంగాజి, ఉపాధ్యక్షుడు పెంటూ, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా మెరుగుపరచాలి

- ఫెయిలైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలి
- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



**ఆసిఫాబాద్, అక్టోబరు 6 ప్రజా జ్యోతి :** విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపరచడంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కుమురం భీం ఆసిఫాబాద్ ఎస్ఈ ఉత్తమ్ జాడే అధికారులకు సూచించారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో సాంకేతిక, ఎంఆర్‌టీ, రెవెన్యూ, కమర్షియల్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా నాణ్యత, ఫీడర్ల పనితీరు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థితిగతులు, విద్యుత్ నష్టాలు, రెవెన్యూ వసూళ్లు, కమర్షియల్ అంశాలపై సమీక్షించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫెయిలైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు, సాంకేతిక సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎస్ఈ సూచించారు. సమావేశంలో డీఈఈలు, ఏడీఈలు, ఏఈలు, ఏఏఓలు, ఎంఆర్‌టీ, కమర్షియల్, టెక్నికల్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## రిసాట్ల పేరుతో ప్రభుత్వ భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ఉమ్మడి జిల్లాల అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్







**ఖానాపూర్ అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి) :** పలుచోట్ల భూములతో పాటు రిసార్ట్‌ల పేరుతో ప్రభుత్వ భూమిని సొంతంగా వ్యాపారం చేసుకుంటున్నా వాళ్లపై చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావులతో పాటు రాష్ట్రానికి చెందిన పలు ఉన్నత శాఖల ముఖ్య కార్యదర్శులు పాల్గొన్నారు సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ ప్రస్తావిస్తూ కడెం మండలంలోరిసార్ట్ పేర ప్రభుత్వ భూములను కాజేస్తున్న వైనాన్ని మంత్రుల దృష్టికి ముఖ్య కార్యదర్శుల దృష్టికి తీసుకువచ్చారు దీనిపై సమగ్రంగా పరిశీలించి కాజేసిన వారిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు అలాగే నియోజకవర్గంలో700 వందలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నిర్మాణం చేస్తుంటే అటవీశాఖ వాళ్ళు కోర్ ఏరియా పరిధిలో ఉన్నాయని నిర్మాణాలను అడ్డుకుంటున్నారని దీంతో ఆదివాసులు ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు ఎన్నో ఏళ్ళుగా నివాసం ఉంటున్న ఈప్రాంతంలోని గిరిజనులు ఇంద్రమ్మ ఇల్లు నిర్మించుకుంటే అటవీ శాఖ అధికారులు అడ్డు తగలడం సరికాదని ఈ సమస్యకు పరిష్కరం చూపి గిరిజన ఆదివాసి ప్రజలకు మేలు చేయాలని మంత్రులను ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ కోరారు కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు జిల్లా రాష్ట్రస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రసంకేతిక రంగంలో మెరిసిన ఆదిలాబాద్ రత్నం

### క్షేత్ర స్థాయి గణిత విజ్ఞాన మేళాలో ఓంకార్‌కు ప్రథమ స్థానం!



**ఆదిలాబాద్ టౌన్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి) :** అదిలాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఓంకార్ ప్రాంతీయ విజ్ఞాన ప్రదర్శనలో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా పేరును మారుమోగించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో కూడిన విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ప్రతిష్ఠాత్మక గణిత విజ్ఞాన మేళా మరియు సాంస్కృతిక మహోత్సవంలో ఓంకార్ ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు.

**అత్యుత్తమ నమూనాగా 'రోబో' :** ఈ పోటీలలో 'నూతన ఆవిష్కరణ' అనే అంశంపై ఓంకార్ సొంతంగా రూపొందించిన వినూత్న రోబో పరికరం న్యాయ నిర్ణేతలను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆలోచనా నైపుణ్యాన్ని జోడించి తయారుచేసిన ఈ ప్రాజెక్ట్ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. విజ్ఞాన రంగంలో విద్యార్థి కనబరిచిన ఆసక్తిని, ప్రాజెక్ట్ వెనుక ఉన్న సాంకేతికతను వివరిస్తూ న్యాయ నిర్ణేతలు ప్రత్యేకంగా అభినందించారు.

**జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక :** ఈ ప్రాంతీయ పోటీలలో అగ్రస్థానాన్ని సాధించిన ఓంకార్, రాబోయే నవంబర్ నెలలో బీహార్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి గణిత విజ్ఞాన మేళా పోటీలలో దక్షిణ మధ్య క్షేత్రం తరఫున పాల్గొననున్నారు. జాతీయ స్థాయిలో కూడా తన ప్రతిభను చాటి మరింత గుర్తింపు సాధిస్తారని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**పాఠశాలలో ఘనంగా సన్మానం :** విద్యార్థి సాధించిన ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు సంజీవ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థి ఓంకార్‌ను మరియు వారి తల్లిదండ్రులను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. రాబోయే జాతీయ స్థాయి పోటీలలో ఓంకార్ మరింత మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## బర్త్ సర్టిఫికెట్ కోసం సామాన్యుడి అరిగోస!

- మున్సిపల్ ఆఫీస్ చుట్టూ తండ్రి ప్రదక్షిణలు
- 'రేపు రా.. మాపు రా' అంటూ తిప్పుతున్నారని ఆవేదన



**ఆసిఫాబాద్, అక్టోబర్ 6 ప్రజా జ్యోతి :** ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మీ సేవ, ఆన్‌లైన్ విధానాలను అందుబాటులోకి తెచ్చినా క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం కోసం ఓ తండ్రి ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతం నుంచి పని మానుకుని కార్యాలయానికి వస్తున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది సరైన సమాచారం ఇవ్వడం లేదని బాధితుడు వాపోయారు. కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ గ్రామానికి చెందిన చాప్లే రాజేందర్ భార్య శారదకు ఆసిఫాబాద్‌లోని శ్రీనివాస హాస్పిటల్‌లో బాబు జన్మించాడు. బిడ్డకు చాప్లే రిత్విక్ అని పేరు పెట్టారు. జనన ధ్రువీకరణ పత్రం కోసం నజర్‌నగర్‌లోని మీ సేవ కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తు ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయానికి చేరినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి అప్రూవల్ రావడం లేదని రాజేందర్ తెలిపారు. దరఖాస్తు పరిస్థితి తెలుసుకునేందుకు మున్సిపల్ కార్యాలయానికి పలుమార్లు వెళ్లినట్లు చెప్పారు. ప్రతి సారి సిబ్బంది నుంచి స్పష్టమైన సమాధానం లభించకుండా 'రేపు రా.. మాపు రా' అంటూ తిప్పి పంపుతున్నారని ఆరోపించారు. తాము చెప్పిన సమయానికి కార్యాలయానికి వెళ్లినా సంబంధిత అధికారులు, సిబ్బంది తమ సీట్లలో అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. దీంతో సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

**పని మానుకుని రావాల్సి వస్తోంది.. :** ఆరెగూడ గ్రామం నుంచి ఆసిఫాబాద్ వరకు వచ్చి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని రాజేందర్ తెలిపారు. ప్రతిసారి ప్రయాణ ఖర్చులు, పని నష్టం జరుగుతున్నాయని పేర్కొన్నారు. చిన్నపాటి జనన ధ్రువీకరణ పత్రం కోసం ఇన్ని రోజులు తిరగాల్సి రావడం బాధాకరమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి :** జనన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న తన సమస్యను వెంటనే పరిష్కరించి బర్త్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని రాజేందర్ కోరుతున్నారు. అలాగే ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిశీలించడంతో పాటు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎస్ఐఆర్ రద్దు చేయాల్సిందే.. వెనక్కి తగ్గేది లేదు

- సీఈసీ రాజీనామా చేయాలి.. బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలి
- ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా







**ఆసిఫాబాద్, అక్టోబరు 6 ప్రజా జ్యోతి :** ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన మూడు ప్రధాన అంశాలపై ఇండియా కూటమి వెనక్కి తగ్గేది లేదని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 'సేవ్ డెమోక్రసీ వీక్'లో భాగంగా మంగళవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కుమురం భీం చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం కలెక్టరేట్ గేట్ ఎదుట నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించకూడదన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటు హక్కుకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా కాకుండా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

దేశంలో ఓటు హక్కు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి పోరాటం కొనసాగిస్తుందని సుగుణక్క తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీ లేదా ఇండియా కూటమికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడే ఉద్యమమని పేర్కొన్నారు. ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు.

**బీఆర్ఎస్‌పై విమర్శలు :** ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్ష పార్టీలు నిరసనలు, పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ తెలంగాణలో బీఆర్ఎస్ స్పందించకపోవడం బాధాకరమని సుగుణక్క విమర్శించారు. బీఆర్ఎస్ వైఖరి బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకమైన విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**పోరాటం ఆగదు :** ఇండియా కూటమి నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ప్రజలను ఐక్యం చేస్తామని తెలిపారు. ఓటు హక్కుపై జరుగుతున్న దాడులను అడ్డుకుని ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్, గెడం టీకానంద్, నిఖిల్, తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ సద్దాల శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, ఇండియా కూటమి సభ్యులు పాల్గొన్నారు.

## బాణం గుర్తుకు ఓటేసిఆర్ టీసీ పిడబ్ల్యూ యును గెలిపించాలి

ప్రభుత్వం అండగా ఉంటుంది
ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్ అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఖానాపూర్ శాసనసభ్యులు, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.

ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల సందర్భంగా మంగళవారం ఉదయం ఉట్నూర్ డిపోను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి కార్మికులతో సమావేశమై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఆర్టీసీ టి డబ్ల్యూ యు సంఘాన్ని గెలిపిస్తే సంస్థకు మరింత బలం చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి కార్మికుడు బాణం గుర్తుకు ఓటు వేసి టి డబ్ల్యూ యు ను గెలిపించాలని కోరారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ టి డబ్ల్యూ యు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ మండల సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్ అక్టోబర్ 6(ప్రజా జ్యోతి) :** ఖానాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో నిర్వహించిన మండల సమీక్షా సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మండలంలో భూములు అక్రమ కబ్జాలకు గురవుతున్న అంశంతో పాటు అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టి (మొర్రం) తవ్వకాలు, అక్రమ వెంచర్లు, అటవీశాఖకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కడెం మండలంలో హరిత రిసార్ట్ పేరిట భూమి అక్రమంగా కబ్జాకు గురవుతున్నట్లు పేర్కొంటూ, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఖానాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని గుర్తించి, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యే కలెక్టర్ని కోరారు.

## వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత-ఎఫ్డీవో రామ్మోహన్



**జన్నారం, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** అడవి,అందులో జీవించే వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత అని జన్నారం ఎఫ్డీవో రామ్మోహన్ అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు-వన్యప్రాణి సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఐటిసి, ఏటిసి విద్యార్థులకు మంగళవారం రోజున వనదీప్తి కార్యక్రమం నిర్వహించారు. వన దీప్తి కార్యక్రమం లో భాగంగా విద్యార్థులను అడవిలోకి తీసుకువెళ్లి కవ్వాల్ పులుల అభయారణ్యము, అటవీ, వన్యప్రాణి సంరక్షణ, జీవవైవిధ్యము మరియు వన్యప్రాణులు వాటి సహజ ఆవాసాలను రక్షించడం యొక్క ప్రాముఖ్యతను ఎఫ్ డి ఓ రామ్మోహన్ వివరించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ తో పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో బాబా ఖాదర్ వలీ, డిఆర్వో మమత, సెక్షన్, బీట్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మురిమడుగులో ఉచిత వైద్య శిబిరం



**జన్నారం, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండల వైద్యాధికారిని డాక్టర్ ఉమాశ్రీ ఆదేశాల మేరకు మంగళవారం రోజున జన్నారం మండలం మురిమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని సోముగూడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.జ్వర పీడితులకు వైద్య సిబ్బంది మలేరియా, డెంగ్యూ రక్తపరీక్షలు చేసి ఉచితంగా మందులు, గోళీలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరాలు అంటువ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి డాక్టర్ గంగాదేవి, హెల్త్ అసిస్టెంట్లు పోచయ్య, సులోచన, ఆశలు రాజేశ్వరి, భూమక్క తదితరులు పాల్గొన్నారు

# పెన్షన్ వెరిఫికేషన్ పారదర్శకంగా చేపట్టాలి

## అర్హులకే సామాజిక భద్రతా పెన్షన్లు అందాలి : అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

రేవల్లి, అక్టోబరు 6 (ప్రజాజ్యోతి):
అర్హత ఉన్న లబ్ధిదారులకే సామాజిక భద్రతా పెన్షన్లు అందేలా వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక




సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రేవల్లి మండలంలోని తల్పనూరు, రేవల్లి గ్రామాల్లో పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. చేయూత దరఖాస్తుల్లో నమోదైన పెన్షన్ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత లేని వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి, నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. వెరిఫికేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

**రేవల్లి సీహెచ్‌సీలో తనిఖీ**

అనంతరం రేవల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఓపీ, ఐపీ విభాగాలతో పాటు ఫార్మసీ, ల్యాబొరేటరీలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజలకు వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీఏ సరోజ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను వీడి.. బీఆర్‌ఎస్‌లోకి

## పెద్దమందడిలో రాజకీయ 'ట్విస్ట్'!
## స్కూలుతండాలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి పలువురి చేరిక..
## కండువాలు కప్పి ఆహ్వానించిన నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబరు 6 (ప్రజాజ్యోతి):
పెద్దమందడి మండలం స్కూలుతండాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి




సమక్షంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో గ్రామ యువత అధ్యక్షుడు ఎం. రాకేష్‌తో పాటు ఎం. శ్రీను, ఎం. లచ్చ, ఎం. రమేష్, ఎం. ఛతురు, ఎం. నారమ్మ, ఎం. ముత్యాలమ్మ, నిజామా, నరేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయామని, భవిష్యత్తులో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందనే నమ్మకంతో పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాముకాటుతో మహిళ మృతి



ఇటిక్యాల,అక్టోబర్ 6(ప్రజా జ్యోతి ప్రతినిధి):
వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ మహిళ పాముకాటుకు గురై మృతి చెందిన విషాద ఘటన గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం గోపాల్దిన్నె గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్దిన్నె గ్రామానికి చెందిన ప్రజాజ్యోతి రిపోర్టర్ గోపాల్ భార్య లలిత అలియాస్ మంజుల (33) సోమవారం పత్తి చేనులో పత్తి ఏరేందుకు వెళ్లింది. సాయంత్రం పత్తి ఏరుతుండగా పాము కాటు వేసింది.కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది.మృతురాలికి కుమార్తె నిస్సి,కుమారుడు అభిషేక్ ఉన్నారు.తల్లిని కోల్పోయిన పిల్లలు,భర్త కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది.లలిత మృతితో గోపాల్దిన్నె గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

## ఆలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు

ఆలంపూర్ అక్టోబర్ 6(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి):
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లోమల్లమ్మకుంట రిజర్వాయర్ నష్టపరిహారం విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే విజయుడు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మల్లమ్మకుంట రిజర్వాయర్ నష్టపరిహారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ అవుతుంది. 'ఎక్కువ పరిహారం ఇప్పిస్తాం' అంటూ రైతుల వద్ద డబ్బులు వసూలు చేసే దళారులు, మధ్యవర్తులను నమ్మవద్దు. వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకండి" అని అన్నారు. అదేవిధంగాఎవరైనా పరిహారం ఇప్పిస్తామని



డబ్బులు డిమాండ్ చేసినా, వసూలు చేయడానికి ప్రయత్నించినా వారి పేర్లతో సహా ఆధారాలను పోలీసులకు అందించి ఫిర్యాదు చేయాలని సూచించారు. రైతులను మోసం చేస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే విజయుడు హెచ్చరించారు. అలాగే రైతుల నష్టపరిహారం రైతుల హక్కు.. దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ప్రతి రైతు అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు.

# భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## జోగులాంబ శక్తిపీఠంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

గద్వాల అక్టోబర్ 06(ప్రజా జ్యోతి ప్రతినిధి):
అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ అమ్మవారి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా




నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 11 నుంచి 20వ,తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు.మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దేవాలయంలో దర్శనం,ప్రసాదం,తాగునీరు,మరుగుదొడ్లు తదితర ప్రాంతాలకు భక్తులు సులభంగా చేరుకునేలా స్పష్టమైన దిశానిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.వీఐపీ ప్రోటోకాల్ విషయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి,అక్కడి నుంచి దేవస్థానం వరకు షటిల్ వాహనాలను నడపాలని సూచించారు.అత్యవసర సహాయం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి,ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో పాటు ఫోన్ నంబర్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.అదనపు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించేందుకు మిషన్ భగీరథ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని,దేవాలయ ప్రాంగణం,ఘాట్ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపు,అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని,నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని సూచించారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాల రద్దీని నియంత్రించాలని ఆదేశించారు. అలంపూర్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులను,అలంపూర్ నుంచి దేవస్థానం వరకు ప్రత్యేక షటిల్ సర్వీసులను పెంచాలని ఆర్టీసీ డీఎంను సూచించారు.ఘాట్ వద్ద భక్తుల భద్రత కోసం ఈతగాళ్లు,లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు.భక్తుల సౌకర్యార్థం అనువైన ప్రదేశాల్లో ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేయాలని, తెప్పోత్సవానికి వినియోగించే పడవలను ఇరిగేషన్ అధికారులు తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న పడవలనే వినియోగించేలా చూడాలని సూచించారు.దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని,అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఇంజిన్‌ను సిద్ధంగా ఉంచాలని అగ్నిమాపక అధికారులను ఆదేశించారు.అలంపూర్ ఆలయాల చరిత్ర,జోగులాంబ అమ్మవారి విశిష్టతను తెలియజేసే సౌండ్ అండ్ లైట్స్ షో నిర్వహించడంతో పాటు దసరా ఉత్సవాలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు.గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, అదనపు ఎస్పీ శంకర్,దేవాదాయ శాఖ ఈఓ దీప్తి,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిని పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

## సామ్, మ్యామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
## గతేడాది 438 మంది.. ప్రస్తుతం 106 మందికి తగ్గింపు
## తల్లీబిడ్డల ఆరోగ్యంపై సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 6 (ప్రజాజ్యోతి):
జిల్లాలో చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని పూర్తిగా నివారించి.. వనపర్తిని సామ్, మ్యామ్ పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మహిళలు, గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రత్యేక



కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు, గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. రక్తహీనత నివారణకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గతేడాది 438 మంది సామ్ పిల్లలు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 106కు తగ్గిందన్నారు. మిగిలిన పిల్లలకు కూడా అవసరమైన పోషకాహారం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా సామ్, మ్యామ్ పిల్లలను గుర్తిస్తే వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైతే పోషక పునరావాస కేంద్రాలకు (ఎన్ఆర్‌సీ) తరలించాలని సూచించారు. అక్కడ మెరుగైన పోషకాహారం, వైద్య చికిత్స అందించి సాధారణ ఆరోగ్య స్థితికి తీసుకురావాలని తెలిపారు.

**అంగన్‌వాడీ సిబ్బందికి అభినందనలు:**

సామ్, మ్యామ్ పిల్లల సంఖ్యను తగ్గించడంలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సెప్టెంబరు 9 నుంచి నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమాల ద్వారా



పోషకాహారం, ఆరోగ్యం, తల్లిపాల ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించిన సిబ్బందిని అభినందించారు. అప్పుడే పుట్టిన శిశువులకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంచే అంశాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యంపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

**గర్భిణులకు సీమంతం:**

పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా పలువురు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి హరికృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్, డీపీఆర్వో సీతారాం, సీడీపీవోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్షతగాత్రులను పరామర్శించిన నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబరు 6 (ప్రజాజ్యోతి):
ఆర్టీసీ డీలక్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో గాయపడి వనపర్తి జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ



మంత్రి, బీఆర్‌ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ప్రమాదంలో 9వ వార్డుకు చెందిన భేడ, బుడగ జంగాల సామాజికవర్గానికి చెందిన కొండ వనజ మృతి చెందగా.. కొండ సుహాసిని కోమాలో ఉన్నారు. తీవ్రంగా గాయపడిన గుగ్గిల నారాయణమ్మతో పాటు చిన్నారులు నందకిషోర్, అక్షయ, మీనాక్షి, శంకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా క్షతగాత్రులను పరామర్శించిన నిరంజన్‌రెడ్డి వారికి ధైర్యం చెప్పారు. మృతురాలు కొండ వనజ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని



వైద్యులకు సూచించారు. పేద కుటుంబాలకు చెందిన బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, ఉంగ్లం తిరుమల్, దేవర్ల నరసింహ, బాబు నాయక్, మర్రికుంట శ్రీను, శిరివాటి శంకర్, భేదాడి కుమార్ తదితరులు ఉన్నారు.

# 9న కిసాన్ మేళా..

## ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

గద్వాల అక్టోబర్ 06(ప్రజా జ్యోతి ప్రతినిధి):



వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే మార్గాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 9న'కిసాన్ మేళా'నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప తెలిపారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని కేఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈ మహా వ్యవసాయ విజ్ఞాన సదస్సును నిర్వహించనున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.కిసాన్ మేళాలో ఆధునిక వ్యవసాయ పరికరాలు,సాగు యంత్రాలు,డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు,నిపుణులతో ముఖాముఖి చర్చలు నిర్వహించి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,తెగుళ్ల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై సూచనలు,సలహాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.అలాగే నాణ్యమైన హైబ్రిడ్ విత్తనాలు,నూతన ఎరువుల వినియోగం,రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ రాయితీలు,సంక్షేమ పథకాలు, వాటికి దరఖాస్తు చేసుకునే విధానంపై అధికారులు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని రైతులందరూ కిసాన్ మేళాను సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని,శాస్త్రీయ విధానాలను అనుసరించి లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప కోరారు.

# మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీ మస్ట్

## 43 నాన్–డిఫాల్టర్ మిల్లులకే ఖరీఫ్ కేటాయింపులు
## బ్యాంక్ గ్యారంటీ లేకుంటే ధాన్యం లేదు
## మిల్లర్లకు అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టీకరణ

వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 6 (ప్రజాజ్యోతి):
ఖరీఫ్ 2026–27 సీజన్‌లో నిబంధనల ప్రకారం బ్యాంకు గ్యారంటీలు సమర్పించిన రైస్ మిల్లర్లకే వరిధాన్యం కేటాయింపులు చేస్తామని జిల్లా




అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాన్–డిఫాల్టర్ రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం 43 రైస్ మిల్లులు నాన్–డిఫాల్టర జాబితాలో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ప్రభుత్వ నిబంధనల మేరకు బ్యాంకు గ్యారంటీలు సమర్పించిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపులు ఉంటాయని చెప్పారు. నిబంధనలు పాటిస్తూ ప్రభుత్వానికి సహకరించే మిల్లర్లకు అవసరమైన సహకారం అందిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**మిల్లర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు**

గోడౌన్ల వద్ద ధాన్యం అన్లోడింగ్‌లో జాప్యం, మిల్లింగ్ ఛార్జీలకు సంబంధించిన సమస్యలను మిల్లర్లు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. ధాన్యం కేటాయింపులు, మిల్లింగ్, అన్లోడింగ్ తదితర అంశాల్లో అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి ఖరీఫ్ సీజన్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ హరీష్, పౌరసరఫరాల శాఖ అధికారి ఆంజనేయులు, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# 7న గద్వాలలో సేవా జ్యోతి యాత్ర

## బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

గద్వాల,అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి ప్రతినిధి):
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా జ్యోతి యాత్ర'లో భాగంగా అక్టోబర్ 7న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ఇన్‌చార్జి బాపు రెడ్డి తెలిపారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో




మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాపు రెడ్డి మాట్లాడారు.గద్వాల పట్టణంలోని స్వర్ణకారుల ఫంక్షన్ హాల్ వద్ద వీడియో ప్రదర్శన అనంతరం సేవా జ్యోతి యాత్ర ప్రారంభమై రథశాల వరకు కొనసాగుతుందని తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవా ప్రయాణం,దేశ అభివృద్ధికి ఆయన చేపట్టిన కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే ప్రధానమంత్రి సంపూర్ణ ఆరోగ్యం,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రతి బూత్, శక్తి కేంద్రం,మండలం నుంచి బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా జ్యోతి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి శక్తి కేంద్రం నుంచి కనీసం ఐదుగురు కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శులు రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావు,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ,మండల అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

- మూడ చందన దేవేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**దేవరుప్పుల, అక్టోబర్ 06(ప్రజాజ్యోతి):** మండలం లోని ధర్మగడ్డ తండాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, సర్పంచ్ అభ్యర్థి మూడ చందన దేవేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వార్డు సభ్యులు,పలువురు నాయకులు మంగళవారం కాంగ్రెస్ గూటికి చేరారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజాపాలన సాగుతోందని స్పష్టం చేశారు. అనంతరం మూడ దేవేందర్ గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా, తండాలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వార్డు మెంబర్ భూక్య బికినీ, నాయకులు భూక్య శ్రీనివాస్, సోమ్లా, బానోత్ శ్రీనివాస్, మూడ మహేష్, మనోజ్ ఉన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల యాదగిరి, పంగ ఐలయ్య, కున్సోత్ లక్ష్మణ్, మూడ జగురామ్, పంగ వెంకన్న, కాసర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమిని గెలిపించాలి

– ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి





**పరకాల, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** పరకాల ఆర్టీసీ డిపోలో జరుగుతున్న ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి టీడబ్ల్యూయూ--ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తూ రీజియన్ క్లాస్ సీరియల్ నంబర్ 6, స్టేట్ క్లాస్ సీరియల్ నంబర్ 3 బాణం గుర్తుపై ఓటు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్టీసీ కార్మికులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఐక్య కూటమి అభ్యర్థులకు ప్రతి కార్మికుడు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఆర్టీసీ కార్మికులు ఐక్యంగా నిలిచి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా టీడబ్ల్యూయూ--ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాబోయే రోజుల్లో పరకాల ఆర్టీసీ డిపోను మరింత అభివృద్ధి చేసి, కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హామీ ఇచ్చారు.

## పైడిపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..





**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. 3వ డివిజన్ పైడిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఆడపిల్లల వివాహ సమయంలో అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులతో పాటు ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సులభంగా అందనున్నాయని చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం పైడిపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, 3వ డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణకర్, మాజీ కార్పొరేటర్ జన్ను శిభారాణి అనిల్, మాజీ పాక్స్ చైర్మన్ బుద్దే పెద్దన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చల్లా పరామర్శ



**పరకాల, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** నడికుడ మండలంలోని కంఠాత్మకూరు గ్రామానికి చెందిన దాసారపు ప్రేమ్ కుమార్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల క్రీడా కిరీటంలో మరో మెరుపు!

- జాతీయ స్థాయి ఎస్ జిఎఫ్ఐ పోటీల్లో పర్వతగిరి విద్యార్థినుల జయకేతనం
- వివిధ క్రీడాంశాల్లో సత్తా.. రాష్ట్రస్థాయి పోటీలకు 12 మంది ఎంపిక



**పర్వతగిరి, అక్టోబర్ 06 (ప్రజాజ్యోతి) :** క్రీడా మైదానంలో పర్వతగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల--కళాశాల విద్యార్థినులు అదరగొట్టారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జిఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై తమ సత్తా చాటారు. అండర్-19 బేస్‌బాల్‌లో ఎం.దివ్య, అండర్-17 హాకీలో డి. శ్రీనిత్య, అండర్-14 ఫెన్సింగ్‌లో కె.శరణ్య, అండర్-14 బేస్‌బాల్‌లో సాత్విక, అండర్-17 రగ్బీలో ఎన్.వర్షిత రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్-17 ఫెన్సింగ్‌లో ఎస్.సింధు, ఎన్.హరిణి, ఎం.వెన్నెల, అండర్-19 టేబుల్ టెన్నిస్‌లో పి. సింధు, అండర్-19 వుషులో జి.తేజస్వి, జి.ప్రియమణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ చాటారు.

**క్రీడా ప్రతిభకు గురుకులం వేదిక :** ఒకే విద్యాసంస్థకు చెందిన విద్యార్థినులు బేస్‌బాల్, హాకీ, ఫెన్సింగ్, రగ్బీ, టేబుల్ టెన్నిస్, వుషు వంటి విభిన్న క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల గురుకుల పాఠశాల–కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినుల క్రమశిక్షణ, కఠోర సాధన, కోచ్‌ల మార్గదర్శకత్వం ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచి పర్వతగిరి గురుకులానికి మరింత పేరు తీసుకురావాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జ్యోత్స్న, వైస్ ప్రిన్సిపాల్ ప్రవళిక, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, పీఈటీ మమత, పీడీ స్రవంతితో పాటు అధ్యాపక బృందం విద్యార్థినులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## గర్భిణులు, బాలింతలకు
# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి







హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి..

**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఎలాంటి జాప్యం లేకుండా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని కలెక్టర్ విస్తృతంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ సేవలు, ఆరోగ్య మహిళా క్లినిక్, ఫెర్టిలిటీ క్లినిక్, ల్యాబొరేటరీ, గైనకాలజీ ఓపీ, స్కానింగ్ గది, స్టోర్ రూమ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌లను పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు, ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, గర్భిణులకు చేపడుతున్న వైద్య పరీక్షలు, నమూనాల సేకరణ విధానం, పరీక్షల రిపోర్టులు అందించే సమయం తదితర వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గైనకాలజీ ఓపీకి వస్తున్న రోగుల సంఖ్య, అందుబాటులో ఉన్న వైద్యుల వివరాలను తెలుసుకున్నారు. స్కానింగ్ గదిలో పరికరాల పనితీరు, రిపోర్టులు అందించే విధానాన్ని పరిశీలించారు. లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్‌లలోని ఏర్పాట్లు, పరిశుభ్రత, పరికరాల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్.. స్టోర్ రూమ్‌లో మందులు, వైద్య పరికరాలు, శస్త్రచికిత్స సామగ్రి, ఇతర వినియోగ వస్తువుల నిల్వలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ, పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్య, వారికి కేటాయించిన విధుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య పరీక్షల రిపోర్టులు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా జాప్యం లేకుండా సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులు, వైద్య సామగ్రి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని వార్డులు, ఓపీ ప్రాంగణం, ల్యాబ్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రసూతి, వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డ్యూటీ వైద్యులు ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వివిధ విభాగాల పనితీరును కలెక్టర్‌కు వివరించారు.

# వరద ముంపునకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం..

- ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి సాధ్యం..
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి..





**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 57వ డివిజన్ పరిధిలో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. సమ్మయ్యనగర్, గోకుల్‌నగర్ ప్రాంతాల్లో రూ.2.52 కోట్ల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

పనులను ఎలాంటి జాప్యం లేకుండా ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్‌తో పాటు పరిసర కాలనీల్లో ప్రతి వర్షాకాలంలో వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అంబేద్కర్ విగ్రహం వైపు నుంచి వచ్చే వర్షపు నీరు, సుబేదారి పోలీస్ స్టేషన్ వైపు నుంచి వచ్చే నీరు గోకుల్‌నగర్ చౌరస్తా వద్ద కలవడంతో ముంపు సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రోడ్డు విస్తరణకు రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రోడ్డు విస్తరణతో పాటు గోకుల్‌నగర్, వడ్డేపల్లి చౌరస్తాలను సుందరీకరించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించేలా చర్యలు చేపడతామన్నారు.

రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులకు దుకాణదారులు, ఇళ్ల యజమానులు ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. వ్యక్తిగత సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అయితే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దని సూచించారు.

రోడ్లు, డ్రైనేజీ, రోడ్డు విస్తరణ, చౌరస్తాల సుందరీకరణ పనులను సమన్వయంతో పూర్తి చేసి 57వ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఆయా కాలనీల ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## బిజే వై ఎమ్ మండల అధ్యక్షునిగా జక్కుల సందీప్ - నియామకం

బిజే వై ఎమ్ మండల అధ్యక్షునిగా జక్కుల సందీప్ – నియామకం



**రాయపర్తి, అక్టోబర్ 6 ప్రజా జ్యోతి :** బీజేవైఎం రాయపర్తి మండల అధ్యక్షునీ గా జక్కుల సందీప్ యాదవ్ నియామకం ఈ సందర్భంగా జక్కుల సందీప్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ జనతాయువమోర్చా రాయపర్తి మండల కార్యదర్శిగా పనిచేసి నేడు నా పై నమ్మకంతో బీజేవైఎం రాయపర్తి మండల అధ్యక్షులు గా అవకాశం కల్పించడం జరిగింది. రాబోయే రోజులలో రాయపర్తి మండలంలోని ప్రతి గ్రామంలో యువకులను పార్టీలో చేరే విధంగా అదేవిధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలు యువకులకు తెలిసే విధంగా మరి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తానని నాపై నమ్మకంతో నియమించినందుకు రాబోయే రోజులలో విద్యార్థుల సమస్యల కోసం మరియు నిరుద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాడుతానని అన్నారు ఈ బాధ్యతకు సహకరించిన బిజెపి జనగాం జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ అన్న కి. బీజేవైఎం జనగామ జిల్లా అధ్యక్షులు ఎల్లవేళలా హరీష్ అన్న కి. పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ లేగ మోహన్ రెడ్డి కి. రాష్ట్ర నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి కి రాయపర్తి మండల అధ్యక్షులు నూనె అనిల్ అన్న కి. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చింత కింది సంతోష్ అన్న కి. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రావణ్ అన్న కి. రాపాక ప్రశాంత్ కి ధన్యవాదములు తెలపడం జరిగింది.

# సర్‌'లో పరకాల టాప్.. బీఎల్‌ఓలకు ఘన సన్మానం





**ఆత్మకూరు, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో పరకాల నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విశేష కృషి చేసిన ఆత్మకూరు మండల బీఎల్‌ఓలను పరకాల ఆర్డీవో డిఎస్ వెంకన్న ఘనంగా సన్మానించారు. మంగళవారం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన ఆత్మకూరు మండలంలోని బిఎల్‌ఓ లతో సమావేశం నిర్వహించారు. అనంతరం బిఎల్‌ఓ లు ఆర్డీవో ను శాలువాతో సన్మానించారు. ఓటర్ల వివరాల సేకరణ, ధ్రువీకరణ, డిజిటలైజేషన్ తదితర ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించిన బూత్ లెవల్ అధికారుల సేవలను అధికారులు అభినందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఇతర ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో పరకాల నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని ఆర్డీవో వెంకన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీఎల్‌ఓలను శాలువాలతో సత్కరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓటర్ల జాబితా సవరణను బాధ్యతగా నిర్వహించిన బీఎల్‌ఓలను అధికారులు అభినందించారు. ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతముగా పూర్తి చేసి పరకాల నియోజక వర్గానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆర్డిఓ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపిడివో శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మంజుల, సూపర్వైజర్లు ఆర్ఐ ఫారూక్, ఆర్ఐ హారిక, కిరణ్, కంప్యూటర్ ఆపరేటర్లు, బిఎల్‌ఓ లు పాల్గొన్నారు.

## బీజేపీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రేవన్ సిద్ధు..



**పరకాల, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి) :** బీజేపీ యువ మోర్చా హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొలనుపాక రేవన్ సిద్ధు నియమితులయ్యారు. నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలనూ సంతోష్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేశ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పున్నం వేణు, పరకాల కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, పెసరు విజయ్ చంద్రారెడ్డి, పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్‌లకు రేవన్ సిద్ధు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను పదవిగా కాకుండా పార్టీ కోసం పనిచేసే అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. యువతను పార్టీతో అనుసంధానం చేయడంతో పాటు కార్యకర్తలకు అండగా నిలిచి పార్టీ విజయానికి తనవంతు కృషి చేస్తానని రేవన్ సిద్ధు పేర్కొన్నారు.

## ప్రతి నాయీబ్రాహ్మణ షాపులో ఎమ్మెల్యే నాయిని చిత్రపటం..





**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి) :** నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి నాయీబ్రాహ్మణ సోదరులు వినూత్న రీతిలో కృతజ్ఞతలు తెలిపారు.

బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి నాయీబ్రాహ్మణ షాప్, సెలూన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని సంఘం నిర్ణయించింది. ఇందులో భాగంగా సెలూన్ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న చిత్రపటాలను ఎమ్మెల్యే నాయిని చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ వృత్తికి గౌరవం, కుటుంబాలకు భరోసా కల్పించేలా ఎమ్మెల్యే నాయిని అండగా నిలుస్తున్నారని తెలిపారు. తమ సమస్యలను తన సమస్యలుగా భావించి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతగా ప్రతి షాపులో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణుల వృత్తి, సంక్షేమం, అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని చేస్తున్న కృషికి గుర్తుగా ఆయన చిత్రపటం తమ వ్యాపార కేంద్రాల్లో ఉండాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి శ్రీనివాస్, నాగవెల్లి సురేష్ కుమార్, తూముల సాంబయ్య, కురిమిళ్ల రమేష్, నాగవెల్లి కృష్ణ, సూరయ్య, కోడెపాక రాజేందర్, నడిగోటి నవీన్, నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నాయకులు జంపాల యుగేందర్, మొగిలిచర్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలో నకిలీ హాజరు..

నిధుల దుర్వినియోగంపై విచారణ



**ఆత్మకూరు, అక్టోబర్ 06 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం లింగమడుగుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం పనుల్లో నకిలీ హాజరు నమోదు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికారులు మంగళవారం గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. లింగమడుగుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 2019--2024 మధ్యకాలంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి నకిలీ హాజరు నమోదు చేసి నిధుల దుర్వినియోగం జరిగిందంటూ గ్రామస్థులు పరకాల ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో, ఆరోపణలపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు డీఆర్‌డీవో ఆర్. లక్ష్మీ ప్రసన్న, శాయంపేట ఎంపీడీవో ఏ. ఫణిచంద్ర, దామెర ఏపీవో పి. శారద తదితరులు గ్రామంలో పర్యటించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన హాజరు, పనుల వివరాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. నిధుల దుర్వినియోగం నిజంగా జరిగిందా?.. జరిగితే బాధ్యులెవరు? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు, రికార్డులను పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించేలా సమగ్ర నివేదికను సమర్పించనున్నారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంలో అప్పటి సిబ్బంది సముద్రాల రవికిరణ్, మాజీ పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి లావణ్యపై ఆరోపణలు వచ్చినట్లు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే విచారణ పూర్తయి నివేదిక అందిన అనంతరం మాత్రమే ఆరోపణల్లో వాస్తవం ఎంతమేరకు ఉందో, బాధ్యత ఎవరిదనే అంశం స్పష్టతకు రానుంది.

## పట్టభద్రుల ఓటు నమోదు చేసుకున్న దైద రవీందర్ దంపతులు

నల్లగొండ అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
నకిరేకల్ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, ఆయన సతీమణి స్వప్న నల్లగొండ–ఖమ్మం–వరంగల్



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకున్నారు. ఎంఆర్ఓ యశ్వంత్ సమక్షంలో వారు ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా దైద రవీందర్ దంపతులు మాట్లాడుతూ ప్రతి పట్టభద్రుడు తమ ఎమ్మెల్సీ ఓటును తప్పని సరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## పిరాటి ఆంజనేయులు మృతి బాధాకరం

### మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, అక్టోబర్ 06, (ప్రజా జ్యోతి) :
దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన పిరాటి ఆంజనేయులు మృతి పట్ల మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



మంగళవారం గొట్టిముక్కలలో ఆంజనేయులు భౌతికకాయానికి రవీంద్ర కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, మాజీ సర్పంచ్ అయ్యన్న, ఎరుకలి యాదయ్య, చందు నాయక్, పర్వతాలు, లింగం, బాధ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే డబుల్ బెడ్రూం ఇళ్లు.. ఏవోకు వినతిపత్రం

నూతనకల్, అక్టోబర్ 06, (ప్రజాజ్యోతి):
మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో నిర్మించిన 32 డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు గ్రామ సర్పంచ్ అంజపల్లి నర్సమ్మ.. మంగళవారం గ్రామస్థులతో కలిసి సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లో ఏవోకు వినతి పంత్రం అందించినట్లు తెలిపారు..



అనంతరం ఆమె మాట్లాడుతూ... గ్రామంలో ఇళ్లను నిర్మించినప్పటికీ ఎవ్వరికి ఉపయోగం లేకుండా అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగ పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. కూలి పనులు చేసుకుంటున్న పేదలు, భర్తను కోల్పోయి పిల్లలను సాకుతూ అత్యంత దీన స్థితిలో బతుకులీడుస్తున్న వితంతువులు, కనీసం పూరి గుడిసే కూడా లేని నిరపేదలో ఎంతో మంది గ్రామంలో ఉన్నారని అలాంటి అభాగ్యులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గ్రామంలో నిర్మించిన ఇళ్ల పంపకాల్లో భారీ అక్రమాలు జరిగుతున్నాయని దానికి ఉన్నతాధికారులు అడ్డుకట్టలేయాలని కోరారు.. రాజకీయ సిఫార్సులతో జరిగిన ఈ కేటాయింపులపై ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి నిజమైన నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో కందాల శంకర్ రెడ్డి, పులుసు సత్యం, అంజపల్లి లక్ష్మయ్య, నగేష్, తిరుమలేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ సాధించేవరకు పోరాటం ఆగదు

భువనగిరి,అక్టోబర్ 6(ప్రజాజ్యోతి):
ఎల్ఐసి1996బ్యాచ్ ఉద్యోగులకు పెన్షన్స్ సౌకర్యం సాధించేవరకు,ఐసీఈయు ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని సికింద్రాబాద్ డివిజన్,ప్రధాన కార్యదర్శి డి ఎస్ రఘు స్పష్టం చేశారు భువనగిరి బ్రాంచ్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ అంశంలో




ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలన్నారు కులమతాల పేరుతో ఎల్ఐసి,ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలన్నారు. అనంతరం భువనగిరి శాఖ ఎల్ఐసి ఐసీఈయూ నూతన బాడీని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా ఎండి అమిరుద్దీన్,సెక్రటరీగా తుమ్మేటి వెంకటేష్,ఉపాధ్యక్షులుగా ఎం అనుదీప్, జాయింట్ సెక్రటరీగా సి నర్సింగ్,ఎస్ఎస్ శ్రీనివాస్,ట్రెజరర్ గా కే రాములు, డబ్ల్యూఎస్సీ గా ఝాన్సీ, ఈసీ మెంబర్లుగా బి శంకరయ్య, సరస్వతి, వేణుగోపాల్ అయ్యంగార్, డీసీఎం గా వగ్గు శివ, కే మాధురి, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు గుణశేఖర్ , నల్గొండ జిల్లా బాలస్వామి, జావిద్ మెదక్ జిల్లా సెక్రెటరీ శివ పాల్గొన్నారు.

# సీఈ సి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి..

### సర్ ప్రక్రియను నిలిపివేయాలి
### ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,
### ఎమ్మెల్యే కుంభం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యలయం భారీ ధర్నా

భువనగిరి,అక్టోబర్ 6(ప్రజాజ్యోతి):
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన,ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రక్రియకు వ్యతిరేకంగా, భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట డీసీసీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం,అనిల్ కుమార్ రెడ్డి,మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్పర్సన్ బండ్రు శోభారాణి, ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది.ప్రజల ఓటు హక్కును పరిరక్షిం చడంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీ ఈ సి )జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.సర్ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులను అరెస్ట్ చేయాలని కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.సర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.ప్రజాస్వా మ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపా డాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.సర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల




పేర్లను తొలగించ డాన్ని తీవ్రంగా వ్యతిరేకి స్తున్నామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.ఓటర్ల జాబితాలను పూర్తి పారదర్శకంగా రూపొందించాలని,ఎలాంటి పొరపా ట్లకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సర్ ప్రక్రియను నిలిపివేసి, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా తమ పోరాటాన్ని కొనసాగి స్తామని స్పష్టం చేశారు. అనంతరం సర్ ప్రక్రియపై తమ అభ్యంత రాలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్పర్సన్ బండ్రు శోభారాణి మున్సిపల్ చైర్మన్లువైస్ చైర్మన్లు,ఏ ఎంసి చైర్మన్లు,




పి ఏ సి ఎస్ చైర్మన్లు,ఆత్మ కమిటీ చైర్మన్లు,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు అఖిలపక్షాల నాయకులు ప్రతినిధులు,ప్రజా సంఘాల నాయకులు,కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆంజనేయులు గౌడ్ మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటు

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడి భౌతికకాయానికి ఎమ్మెల్యే బాలు నాయక్ నివాళి

దేవరకొండ, అక్టోబర్ 06, (ప్రజా జ్యోతి) :
గొట్టిముక్కల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పిరాటి ఆంజనేయులు గౌడ్ మృతికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నివాళులర్పించారు. మంగళవారం ఆయన స్వగృహానికి వెళ్లి ఆంజనేయులు గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. పిరాటి ఆంజనేయులు గౌడ్ కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో సేవలందించిన సీనియర్ నాయకుడని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తనదైన సేవలు అందించారని గుర్తుచేశారు. ఆంజనేయులు గౌడ్ మృతి కాంగ్రెస్ పార్టీకి, గొట్టిముక్కల గ్రామానికి తీరని లోటని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మారుపాకుల సురేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ ఎరుకల పార్వతి వెంకటేష్, కడారి అయ్యన్న, జటావత్ లక్ష్మి పతి, కిన్నెర హరికృష్ణ, ముకురోజు రాజు, ఎరుకల వెంకటయ్య, దేపా జగత్ రెడ్డి, ఈదుల నర్సిరెడ్డి, దేపా మధుసూదన్ రెడ్డి, యెషమోని మల్లేష్, జరుపుల రతన్, చాట్ల శ్రీనుతో పాటు గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

భువనగిరి,అక్టోబర్ 6(ప్రజాజ్యోతి,):
భువనగిరి పట్టణంలోనిరావిభద్రారెడ్డి గార్డెన్స్‌లో,రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు



తీసుకుం టున్నామని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సరుకులు మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు మరింత సులభంగా అందేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి ఎంఆర్ఓ జగన్ మున్సిపల్ కమిషనర్ 31వ,వార్డు కౌన్సిలర్ సుమయ్య తబస్సుమ్, షఫీక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

### బ్యాంకు రుణాలు మాఫీ చేయాలి
### రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయొద్దు
### చింతపల్లి బయన్న సీపీఐ(ఎం) మండల కార్యదర్శి డిమాండ్

నార్కట్ పల్లి, అక్టోబర్ 6 ( ప్రజా జ్యోతి ):
మండలంలో నీ శేరు బావిగూడెం గ్రామంలో ఎండిపోయిన పంట



పొలాలను సిపిఐ(ఎం) బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నీరు లేక పంట పొలాలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.పంట నష్టాన్ని పరిశీలించి, రైతుల వరి పొలం పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారు 40 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని తెలిపారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే, నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర పంట నష్టం సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని అన్నారు నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి ఎకరాకు 20వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని కోరారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించి, భవిష్యత్తులో ఇలాంటి నష్టాలు జరగకుండా సాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకు పెద్దులు, కుమ్మరి శంకర్, దండు రవి, బొల్లెద్దు సైదులు, ఆమనగంటి ఐలయ్య, దండు శంకర్, శాఖ కార్యదర్శిలు దండు నాగరాజు, అలుగుబెల్లి లింగారెడ్డి దండు శ్రీను,దండు శంకరయ్య పులిపెల్లి వెంకట్ రెడ్డి, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గురువుల సేవలకు గుర్తింపు

### శాలిగౌరారంలో ఘనంగా ఉపాధ్యాయుల సన్మానం

నల్లగొండ, అక్టోబర్ 6: (ప్రజా జ్యోతి ప్రతినిధి):
విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని శాలిగౌరారం తహసీల్దార్ కేతావత్ మాధవరావు అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో







మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాధవరావు మాట్లాడుతూ విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పే ఉపాధ్యాయులే సమాజంలో ఆదర్శంగా నిలుస్తారన్నారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు పోలగాని వెంకటేశ్వర్లు, కర్నాటి శ్రీనివాసు, చామల నర్సయ్య, మన్నె దేవయాణి, చింతల నర్సింహా, బెల్లి కృష్ణమూర్తి, చివుట జ్యోతి, కోట మల్లయ్య, మందుల సైదులును శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మందుల సైదులు, జడ్పీ స్కూల్ హెచ్ఎం కోట మల్లయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల ఆంజనేయులు, డీసీ మెంబర్ బుడిగె శ్రీనివాసులు, జిల్లా జీఈటీ కో–ఆర్డినేటర్ ఎర్ర శంభులింగారెడ్డి, కార్యదర్శి కప్పల శ్రీకాంత్, కోశాధికారి మురారిశెట్టి కరుణాకర్, రామడుగు వెంకట్రామ శర్మ, దునక వెంకన్న,జిపివో పిల్లి యాదయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ తరహాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం

### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్.. జప్తివీరప్పగూడెంలో స్థల పరిశీలన

మిర్యాలగూడ,అక్టోబర్ 06,( ప్రజాజ్యోతి ):
కార్పొరేట్ స్థాయిని తలపించే రీతిలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.మిర్యాలగూడ నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికై మంగళవారం ఆయన మిర్యాలగూడ



మండలం, జప్తి వీరప్పగూడెం గ్రామంలోని సర్వే నంబర్ 214లో సుమారు 20 నుంచి 25 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి అనువుగా ఉన్న స్థల వివరాలు,సంబంధించిన లే అవుట్లు, భూ రికార్డుల వివరాలన్నిం టినీ సమర్పించాలని రెవిన్యూ అ ధికారుల ను ఆ దేశించారు. స్థ లానికి సబంధించిన రికార్డు లను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత వస్తుందని, అందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2500 మంది విద్యార్థులకు సరిపోయే విధంగా తరగతి గదులు, డార్మెటరీలు, కిచెన్, డైనింగ్, ల్యాబ్లు, లైబ్రరీ, ఆట స్థలాలు, ఇలా అన్ని సౌకర్యాలను కల్పించి కార్పొరేట్ తరహాలో వీటిని తీర్చిదిద్దనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడి రవికుమార్ ,ఆర్ ఐ రామకృష్ణ , ఆర్ ఐ కృష్ణయ్య, డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాస్ రెడ్డి, సర్వేయర్లు శ్రీనివాస్, సైదులు, నరసింహ , కలెక్టర్ వెంట ఉన్నారు.



## సునీత కుటుంబానికి ఆర్థిక చేయూత

గరిడేపల్లి, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):
రాయినిగూడెం గ్రామపంచాయ తీ ఫీల్డ్ అసిస్టెంట్ సునీత అకాల మృతితో



కుటుంబానికి గరిడేపల్లి మండల పరిషత్ సిబ్బంది అండ గా నిలిచారు. ఎంపీడీవో ఆర్. సరోజ ఆధ్వర్యంలో మండల పరిషత్ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు,ఉపాధిహామీ సిబ్బంది సమకూర్చిన ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ సహాయాన్ని ఆమె కుమారుడికి అందజేశారు.అంత్యక్రియల ఖర్చుల కోసం ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంగాపురం సర్పంచ్ బత్తిని అంజయ్య, రాయినిగూడెం సర్పంచ్ గుండు రామాంజి గౌడ్,మాజీ ఎంపీటీసీ బల్దూరి సందీప్,ఏపీవోలు లావుడి సూరనాయక్, రాయికింది సురేష్,వీబీజీ రామ్‌జీ,ఈసీ సుజాత,టెక్నికల్ అసిస్టెంట్లు,పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

### ఎంఎస్ఎఫ్ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో

## హలో విద్యార్థి - చలో ఉస్మానియా యూనివర్సిటీ

• పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ వారి పిలుపు మేరకు



**కోటగిరి, అక్టోబర్ 6, ప్రజా జ్యోతి.** బాన్సువాడ నియోజకవర్గ ఇంఛార్జ్ సోంపూర్ పోచిరాం మాదిగ గారి ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గ వివిధ మండలాల నుంచి తరలి వెళ్లినా యువ నాయకులు సమాజ అభివృద్ధి విద్యతోనే సాధ్యమని, విద్యారంగం లోని సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వాల దృష్టికి పోరాటాల రూపం లో ముందుకు తీసుకెళ్లే విధంగా కార్యాచరణ లో భాగంగా. విద్యార్థి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగు తుంది.అందులో భాగంగా బాన్సువాడ నియోజకవర్గం నుంచి భారీగా ఎం ఎస్ ఎఫ్ విద్యార్థి యువ నాయకులు, కోటగిరి, పోతంగల్ మండల నేర్రోళ్ళ అశోక్ మాదిగ, పోశెట్టి మాదిగ సీనియర్ నాయకులు నాగయ్య , ఎన్ .హరిదాస్ మాదిగ, జి .నవీన్ మాదిగ, సంతోష్ మాదిగ, నాగేష్ మాదిగ,వినోద్ మాదిగ,గణేష్ మాదిగ, నర్సింలు మాదిగ, నితిన్ మాదిగ మాదిగ యువ నాయకులు బయలుదేరడం జరిగింది..

## క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి ) అక్టోబర్. 6** ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధిగ్రస్తులు చికిత్స సమయంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి డాక్టర్ రాజశ్రీ తెలిపారు. టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగ తిరుమల మెడికల్ అకాడమీ వ్యవస్థాపకులు పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్వాయి పరిధిలోగల డిచ్పల్లి ఇందల్వాయి మండలంలోని క్షయ వ్యాధిగ్రస్థులకు 50 కిట్లను అందజేయడం జరిగింది. క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులు సమయానుకూలంగా మందులు వేసుకోవాలని వాటితో పాటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల క్షయ వ్యాధి తొందరగా నయం అవుతుందని, అన్ని స్వచ్ఛంద సంస్థలు కార్పొరేట్ సంస్థలు ఇలా పోషక కిట్లను ఇవ్వడానికి ముందుకు రావాలని వైద్యాధికారి డా శ్రీశ్రీ సుశాంత్ రెడ్డి సూచించారు. క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించాలని అందుకు సమాజం యొక్క సహకారం అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అడ్మిస్ట్రేటింగ్ ఆఫీసర్ సుమన్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి.సి నాగరాజ్, ఆరోగ్య బోధకులు వెంకటేశ్వర్లు, ఎన్. ఎచ్. ఎం.ప్రోగ్రాం ఆఫీసర్ విశాల రాణి,పి. ఎచ్. ఎన్. మేరమ్మ ఆరోగ్య పర్యవేక్షకులు సమాధానం,దేవపాల, టీ. బి. ఎస్. టీ. ఎల్. ఎస్ పద్మ ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## మన ఊరు-మన భద్రతపై పోలీసుల అవగాహన

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) అక్టోబర్. 6** ఇందల్వాయి: "మన ఊరు--మన భద్రత, మన బాధ్యతే.. మహిళా భద్రత మనందరి బాధ్యత" అనే నినాదంతో ఇందల్వాయి మండల కేంద్రంలో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112/100 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. పోలీసులకు ప్రజలు సహకరిస్తే సురక్షిత సమాజాన్ని నిర్మించవచ్చుని, "మన ఊరిని సురక్షితంగా ఉంచే బాధ్యత మనందరిదే" అని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్ పాల్గొని ప్రజలకు భద్రత, మహిళా రక్షణ, సైబర్ నేరాలపై పలు సూచనలు చేశారు.



# సీఈసీ జ్ఞానేష్ రాజీనామా చేయాలి

• ఎమ్మెల్యే మదన్ మోహన్ డిమాండ్ • కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**ఎల్లారెడ్డి, అక్టోబర్ -6(ప్రజా జ్యోతి )** రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఖూనీ చేస్తోందని ఎమ్మెల్యే మోహన్ రావు అన్నారు. కేంద్రానికి తొత్తుగా మారిన కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఈసీ రాజీనామా కోరడంతో పాటు కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఓట్ చోర్... దేశ్ చోర్ పై పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుంచి మొదలైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా మీదుగా గాంధీ చౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ.. ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్ - సర్) పేర అర్హుల ఓట్లను తొలగించి జ్ఞానేష్ కుమార్ దారుణానికి పాల్పడ్డారని విమర్శించారు. సీఈసీతో రాజీనామా చేయించడమే కాక వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర సంస్థగా పని చేయాల్సిన ఎన్నికల సంఘాన్ని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కీలుబొమ్మలా మార్చుకుందని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను ప్రధాని మోడీ మంట కలుపుతున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో గాంధీ చౌక్ వద్ద సీఈసీ జ్ఞానేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## కామారెడ్డి బల్దియాలో విజిలెన్స్ అధికారుల దాడులు బిల్లుల గోల్‌మాల్ పై ముమ్మర దర్యాప్తు

**కామారెడ్డి టౌన్ అక్టోబర్ 06(ప్రజాజ్యోతి)** కామారెడ్డి మున్సిపాలిటీలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. అవినీతి, అక్రమాలు, బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఏసీబీ తనిఖీల అనంతరం విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగడం బల్దియా వ్యవహారాలపై మరింత ఆసక్తిని పెంచుతోంది. తాజాగా పనుల బిల్లుల చెల్లింపుల్లో అవకతవకల ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి మున్సిపల్ కార్యాలయంలోని ఎంబీ బుక్కులు, బిల్లులు, సంబంధిత ఫైళ్లను పరిశీలించారు. కొన్ని కీలక రికార్డులను తమ వెంట తీసుకెళ్లినట్లు సమాచారం. 026 మార్చి 16న కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, పెండింగ్ దరఖాస్తులు, రికార్డులను పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, ఆస్తిపన్ను, ఇంధన ఖర్చులు తదితర అంశాలపై ఏసీబీ అధికారులు వివరాలు పరిశీలించినట్లు ఆ సమయంలో తెలిపారు.మున్సిపాలిటీలో శానిటేషన్, వాటర్ వర్క్స్, జనరల్ ఫండ్, 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు, ప్రత్యేక అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులపై కొందరు కౌన్సిలర్లు సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పనులు, అంచనాలు, ఎంబీ బుక్కులు, బిల్లుల మధ్య వ్యత్యాసాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. విజిలెన్స్ బృందం ఈ నెల 1న కామారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో ప్యాచ్‌వర్క్‌లు, సీసీ రోడ్డు, బోర్‌వెల్ మోటార్, స్ట్రీట్‌లైట్లు, డంపింగ్‌యార్డు తదితర పనులను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో సంబంధిత రికార్డులను తనిఖీ చేసి కొన్ని పనులకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు సమాచారం. మున్సిపాలిటీ ద్వారా కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం కూడా పట్టణ అభివృద్ధి కోసం పలు గ్రాంట్లు కేటాయిస్తోంది. మున్సిపాలిటీలో రోడ్లు, పార్కులు, డ్రైనేజీలు, మార్కెట్, వైకుంఠధామం తదితర అభివృద్ధి పనులకు వివిధ నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రతి రూపాయి ప్రజాధనం సక్రమంగా ఖర్చవుతోందా పనుల నాణ్యతకు తగ్గట్టుగానే బిల్లులు చెల్లిస్తున్నారా గతంలో పూర్తయిన పనులకు మళ్లీ బిల్లులు చెల్లించారా ఎంబీ బుక్ లు, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, చెల్లింపుల మధ్య ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. గతంలో ఏసీబీ తనిఖీలు, ఆ తర్వాత విజిలెన్స్ విచారణల నేపథ్యంలో బల్దియాలో అసలు ఏం జరుగుతోందన్న చర్చ ప్రజల్లో మొదలైంది. అయితే విచారణ పూర్తై ఎటువంటి నివేదిక వెలువడే అవకాశం ఉందో విజిలెన్స్ నివేదికలో ఏం తేలనుందో బాధ్యులపై చర్యలు ఉంటాయా లేక ఫైళ్ల పరిశీలనతోనే వ్యవహారం ముగుస్తుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.






## డెకరేషన్ యూనియన్ అధ్యక్షుడిగా దర్గా వీరేశం

• ప్రధాన కార్యదర్శిగా అనిల్, వినోద్ • నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**జిన్నారం (ప్రజాజ్యోతి)** జిన్నారం, గుమ్మడిదల మండలాల పరిధిలో శుభకార్యాలు, వివాహాలు, ఇతర వేడుకలకు డెకరేషన్ సేవలు అందించే కార్మికులు, నిర్వాహకులతో కూడిన డెకరేషన్ యూనియన్‌కు నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు మండలాల పరిధిలో డెకరేషన్ రంగంలో పనిచేస్తున్న సభ్యులు



సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. యూనియన్ అధ్యక్షుడిగా దర్గా వీరేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అనిల్ వినోద్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సత్తి శ్రీశైలం, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా నీరుడు శ్రీనివాస్, నర్సింహులు, సత్తి,మోహన్, కృష్ణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో డెకరేషన్ రంగంలో పనిచేస్తున్న వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ సభ్యుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు, శుభకార్యాల నిర్వాహకులకు నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డెకరేషన్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, నిర్వాహకుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. సభ్యుల మధ్య సమన్వయం పెంచి, వృత్తిపరమైన సమస్యలను చర్చించి పరిష్కరించుకునేలా యూనియన్‌ను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. నూతన కార్యవర్గం ఎన్నికతో డెకరేషన్ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

### సొంత నిధులతో కాలనీకి

## రహదారి వేయించిన ఉప్పరి లక్ష్మణ్ సాగర్

• సంజీవన్‌రావుపేట తోట చివరి కాలనీ వాసుల ఇబ్బందులకు పరిష్కారం

**నారాయణఖేడ్, అక్టోబర్ 6, ప్రజాజ్యోతి:** నారాయణఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట గ్రామంలోని తోట చివరి కాలనీలో నెలకొన్న రహదారి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. చాలా కాలంగా సరైన రహదారి సౌకర్యం లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. కాలనీ రహదారి సమస్యను పలుమార్లు సంబంధితుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ఉప్పరి లక్ష్మణ్ సాగర్ స్పందించి, కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తన సొంత నిధులతో రహదారి పనులు చేపట్టారు. రహదారి సౌకర్యం లేని ప్రాంతాల్లో కొత్తగా రోడ్డు వేయించడంతో పాటు అవసరమైన చోట్ల మరమ్మతులు చేయించారు. దీంతో తోట చివరి కాలనీకి రాకపోకలు సులభతరమయ్యాయి. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను గుర్తించి, తన సొంత ఖర్చులతో రహదారి పనులు చేపట్టిన ఉప్పరి లక్ష్మణ్ సాగర్‌ను కాలనీవాసులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.





# అధ్వానంగా మారిన రోడ్లపై పాదయాత్ర

• విద్యుత్ సమస్యలపై సబ్‌స్టేషన్ ముట్టడి • మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**నారాయణఖేడ్, అక్టోబర్ 6, ప్రజాజ్యోతి:** నాగల్‌గిద్ద మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రోడ్లను వెంటనే నిర్మించాలని, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర, ధర్నా నిర్వహించారు. కారముంగి నుంచి కారస్‌గుత్తి వరకు పాదయాత్ర చేపట్టి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి రైతుల పంటలను కాపాడాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజల అవసరాలను గుర్తించి నారాయణఖేడ్ నుంచి డబుల్ లైన్ రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు పలు రోడ్లను మంజూరు చేయించానన్నారు. మండలంలో నాలుగు కొత్త చెరువులను కూడా మంజూరు చేయించినట్లు తెలిపారు. తాను గతంలో మంజూరు చేయించిన రోడ్లను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేయలేకపోతోందని విమర్శించారు. కనీసం ఇప్పటికే ఉన్న రోడ్లపై ఏర్పడిన గుంతలను కూడా పూడ్చలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలు, రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రజా సమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు. మంజూరైన రోడ్లను పూర్తి చేయకుండా, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతులకు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నారని, సరైన సమయంలో విద్యుత్ అందక పంటలు దెబ్బతింటే వారి బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులను కరెంటు కోసం సబ్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతోందన్నారు. మంజూరైన రోడ్లను పూర్తి చేయడంతో పాటు రోడ్లపై గుంతలను పూడ్చి ప్రజల కష్టాలను తీర్చాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.















# రేణుకా మాతా చల్లంగా చూడు





- తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి
- పాడి, పంటలు చల్లంగా చూడాలి
- పాలట జయశ్రీ దుర్గ ప్రసాద్ గౌడ్

మెదక్ /కొల్చారం, అక్టోబర్ 06( ప్రజా జ్యోతి ):- ఆదిశక్తి పరాశక్తి రేణుకా ఎల్లమ్మను దర్శించుకుంటే అన్ని శుభాలే కలుగుతాయని పాలట జయశ్రీ దుర్గ ప్రసాద్ గౌడ్ దంపతులు అన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ 5 వ వార్షికోత్సవము ఆనంతరం మొదటి మంగళవారం నాడు కొల్చారం గ్రామానికి చెందిన పాలట జయశ్రీ దుర్గ ప్రసాద్ గౌడ్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక, అలంకరణ, అర్చన కార్యక్రమం నిర్వహించగా ఆలయ అర్చకులు పులుగుర్త నాగరాజు శర్మ మంత్రోచ్ఛహారణల మధ్య ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజగౌడ్, రామకృష్ణ గౌడ్,అశోక్ గౌడ్, రామాగౌడ్,కృష్ణ గౌడ్ (కిట్టు) చౌరిగారి చిన్న రాములు,ఆర్కేల నాగరాజు , సంజీవ్ రావు,రాజి రెడ్డి,సుధాకర్ గౌడ్,పాంద్ర శ్రీనివాస్, సుదర్శన్,పాపగౌడ్,శివ కుమార్ గౌడ్, నారాయ ణగౌడ్,సత్యనారాయణ,కుమ్మరి నాగరాజు, మ్యాదరి సత్యనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఇద్దరు టీచర్లకు ఘనత

- గైడ్ టీచర్‌గా అర్చన, స్కౌట్ మాస్టర్‌గా మహమ్మద్ ఖదీర్ పాషా
- టీచర్ల విజయంపై హెచ్ఎం సాంబయ్య ప్రత్యేక అభినందనలు

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 06: విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన నైపుణ్యాలను అందించడంలో భాగంగా వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ పొందడం విశేషంగా నిలిచింది. పాఠశాలకు చెందిన అర్చన, మహమ్మద్ ఖదీర్ పాషా స్కౌట్స్ అండ్ గైడ్స్ బేసిక్ ట్రైనింగ్‌లో పాల్గొని శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. అర్చన గైడ్ టీచర్‌గా, మహమ్మద్ ఖదీర్ పాషా స్కౌట్ మాస్టర్‌గా శిక్షణ పొందారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులను స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాల్లో భాగస్వాములను చేయడం, వారిలో సేవా దృక్పథాన్ని పెంచడం, క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన అంశాలపై అవగాహన పొందారు. శిక్షణ




పూర్తిచేసిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మెదక్ జిల్లా విద్యాధికారి రాజు, ఏఎంఓ సుదర్శన్ మూర్తి చేతుల మీదుగా ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం, ఇతరులకు సహాయపడే మనస్తత్వాన్ని అలవర్చుకోవడం, బృందంగా పనిచేయడం, కష్టసమయాల్లో ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడం వంటి లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులు శిక్షణ పూర్తి చేయడంతో పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నిరంతరం మార్గదర్శకత్వం అందించనున్నారు.

# అధైర్య పడకండి అండగా ఉంటా

- వేదాన్ష్ కుటుంబానికి హరీష్ రావు భరోసా
- మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచన





సిద్దిపేట అర్బన్,అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి):- అధైర్య పడకండి అండగా ఉంటానని వేదాన్ష్ కుటుంబ సభ్యులకు మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు భరోసానిచ్చారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామానికి చెందిన పబ్బతి నాగరాజు కుమారుడైన పబ్బతి వేదాన్ష్ కు గుండెకు సంబంధించిన ఆపరేషన్ విషయంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని స్టార్ ఆసుపత్రిలో ఉన్నాడని ఎన్సాన్ పల్లి గ్రామమాజీ సర్పంచ్ బిఆర్ఎస్ నాయకుడు బి రవీందర్ గౌడ్ ఇచ్చిన సమాచారంతో మంగళవారం హరీష్ రావు ఆసుపత్రికి వెళ్లి వేదాన్ష్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వేదాన్ష్ విషయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసానిచ్చారు.

# ఒక గొప్ప నాయకుడిని కోల్పోయాం

- బాధిత కుటుంబానికి అండగా ఉంటా
- మహేందర్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసిన ఎంపీ రఘునందన్ రావు

దుబ్బాక అక్టోబర్ 06 (ప్రజా జ్యోతి) భారతీయ జనతా పార్టీలో సత్తు మహేందర్ రెడ్డి చురుకైన కార్యకర్తగా పాల్గొంటూ, నేడు భారతీయ జనతా పార్టీ కుటుంబాన్ని వదిలిపోవడం చాలా దురదృష్టకరంగా ఉందని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అన్నారు. మంగళవారం రోజున దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో చెల్లాపూర్ లో బిజెపి బూత్ కమిటీ అధ్యక్షుడు సత్తు మహేందర్ రెడ్డి గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకొని మెదక్ ఎంపీ రఘునందన్ రావు వారి భౌతికయానికి బిజెపి జెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సత్తు మహేందర్ రెడ్డి ఒక కార్యకర్త కాదు అని, ఒక గొప్ప నాయకుడని అలాంటి వ్యక్తి నేడు మా నుండి దూరమవడం భారతీయ జనతా పార్టీకి తీరని





లోటు అన్నారు. భారతీయ జనతా పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ గ్రామ అభివృద్ధి కోసం వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ గా ఉంటూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసిన గొప్ప వ్యక్తి మహేందర్ రెడ్డి అని వారన్నారు. అలాంటి గొప్ప నాయకుడు మరణం చెల్లాపూర్ గ్రామానికి తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని , అంతేకాకుండా ప్రభుత్వపరంగా కూడా వారి కుటుంబానికి సహాయ సహకారలు అందిస్తానన్నారు. మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను బంధువులను పరామర్శించి ఓదార్చి కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారి వెంట బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కిష్టమ్మ గారి సుభాష్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి దూలం వెంకట్ గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, బిజెపి కౌన్సిలర్లు గంభీర్ పూర్ కనకరాజు, మెరుపుల సాయి గౌడ్, బిజెపి నాయకులు ఎస్ ఎన్ చారి, సుంకోజి ప్రవీణ్ కుమార్, మల్లు గారి రమణారెడ్డి, కిష్టమ్మ గారి రమేష్ రెడ్డి, కాల్వ లింగం, అంబటి శివప్రసాద్ గౌడ్ తదితరులు ఉన్నారు.





# సత్తు మహేందర్ రెడ్డి పాడె మోసిన రఘువర్ధన్ రెడ్డి

- సత్తు మహేందర్ రెడ్డి మృతి చాలా బాధాకరం
- మహేందర్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాడి పల్లి రఘువర్ధన్ రెడ్డి

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 06( ప్రజా జ్యోతి) ప్రముఖ యువ రైతు, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ సత్తు మహేందర్ రెడ్డి అకాల మరణం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డి అంత్యక్రియలు చెల్లాపూర్ గ్రామంలో అత్యంత విచారకరమైన వాతావరణంలో జరిగాయి. ఈ అంత్యక్రియల





కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి స్వయంగా పాల్గొని, సత్తు మహేందర్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి పాడె మోసారు. ఈ సందర్భంగా గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... "యువ రైతుగా, ఆధ్యాత్మిక సేవకుడిగా ఎంతో చురుకైన పాత్ర పోషిస్తూ, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్‌గా గ్రామ ప్రజల మన్ననలు పొందిన మహేందర్ రెడ్డి ఇంత చిన్న వయసులోనే మరణించడం అత్యంత బాధాకరం. ఆయన మరణం చెల్లాపూర్ గ్రామానికే కాకుండా, యావత్ దుబ్బాక ప్రాంతానికి తీరని లోటు" అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం, మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను, బంధువులను రఘువర్ధన్ రెడ్డి పరామర్శించి, వారిని ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ మరియు తాను ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన ఆత్మకు సద్గతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర దుఃఖాన్ని తట్టుకునే మానసిక ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, చెల్లాపూర్ గ్రామ పెద్దలు, యువకులు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని మహేందర్ రెడ్డికి కన్నీటి వీడ్కోలు పలికారు.

# ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడాలి

- పీసీసీ కార్యదర్శి, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

నంగునూర్ అక్టోబర్ 6(ప్రజా జ్యోతి):- కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహార శైలిపై పీసీసీ కార్యదర్శి, నంగునూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడేలా నిర్ణయాలు ఉండాలని, ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాల్లో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత్వం పాటించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ాలుక×=) ప్రక్రియతో పాటు ఓటర్ల జాబితాల మార్పులు, తొలగింపులు ఎన్నికల సంఘం నిర్ణయాల విధానంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యే విధంగా ఉండాలని ఆయన అన్నారు.

**ఓటర్ల హక్కులను కాపాడాలి**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా సరైన ప్రక్రియ లేకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదని అన్నారు. ాలుక×= ప్రక్రియలో ఓటర్ల పేర్ల తొలగింపు లేదా మార్పులకు సంబంధించి అభ్యంతరాలు ఉన్నట్లయితే, సంబంధిత ఓటర్లకు తగిన సమాచారం అందించి, తమ అభ్యంతరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, పౌరులకు అందుబాటులో ఉండే సమాచారాన్ని మరింత విస్తృతం చేయాలని కోరారు.

**నిర్ణయాలపై స్పష్టత ఇవ్వాలి**

ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తీసుకునే విధానంపై ఇటీవల జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందన్నారు.



ముగ్గురు సభ్యుల ఎన్నికల సంఘంలో నిర్ణయాలపై అంతర్గత అభ్యంతరాలు వ్యక్తమైనట్లు మీడియా కథనాలు వెలువడిన నేపథ్యంలో, సంస్థ నిర్ణయ ప్రక్రియపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు రాజ్యాంగబద్ధమైన విధానాలకు అనుగుణంగా, అందరికీ సమానంగా వర్తించే విధంగా ఉండాలని యాదగిరి కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఎలాంటి అనుమానాలు తలెత్తకుండా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు మొత్తం ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు.

**రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరించాలి**

ఎన్నికల సంఘం అధికారికంగా స్వతంత్ర సంస్థగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని యాదగిరి అన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా కాకుండా రాజ్యాంగం, ఎన్నికల చట్టాలు, ఓటర్ల హక్కులను ప్రాతిపదికగా చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. జ్ఞానేష్ కుమార్ వ్యవహార శైలిపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలకు ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల్లో నెలకొనే అనుమానాలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడుకోవచ్చని అన్నారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు**

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ాలుక×= ప్రక్రియలో తొలగించినట్లు పేర్కొంటున్న ఓట్లను పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. తెలంగాణలో కూడా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు, అభ్యంతరాలపై ఎన్నికల సంఘం సమగ్రంగా స్పందించి ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని కోరారు.

**ప్రజాస్వామ్యంపై విశ్వాసమే ముఖ్యం**

"ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నాయనే విశ్వాసం ప్రతి పౌరుడిలో ఉండాలి. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఒక్క వ్యక్తి పేరు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడాలి. ఎన్నికల సంఘం తన నిర్ణయాల్లో పారదర్శకతను పాటించి ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలి అన్నారు. ఎన్నికల సంఘంపై వస్తున్న విమర్శలు, ాలుక×=పై రాజకీయ పార్టీల అభ్యంతరాల నేపథ్యంలో ప్రజలకు పూర్తి సమాచారం అందించడం, నిర్ణయాల ప్రక్రియపై స్పష్టత ఇవ్వడం, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు భద్రత కల్పించడం అత్యంత ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమం లో అచ్చిన సత్తయ్య, మాజీ సర్పంచ్ చేర్యాల బాలయ్య, మాజీ ఉప సర్పంచ్ పాలేపు నర్సింలు గౌడ్, భాస్వరాజ్ రాములు, సోషల్ మీడియా మండల అధ్యక్షులు మ్యాక రజినీకాంత్, ఐలేని యాదగిరి గౌడ్,తిరుపతి, ఏజాజ్ ఉద్దీన్,పాల్గొన్నారు.

# వేప కషాయంతో పంటలకు చీడపీడల నియంత్రణ

- దౌలాపూర్‌లో రైతులకు అవగాహన
- సర్పంచ్ కుకునూరు కృష్ణ, సిరిసిల్ల కళాశాల విద్యార్థిని నందిని




జగదేవపూర్, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి): పంటలను ఆశించే చీడపీడలను సహజ పద్ధతుల్లో నియంత్రించేందుకు వేప కషాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు డి.నందిని, సర్పంచ్ కుకునూరు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,దౌలాపూర్ గ్రామంలో వేప కషాయం తయారీ, పంటలకు వినియోగించే విధానంపై ప్రదర్శన సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు డి.నందిని,జి.ప్రవళిక,కె. శివాని,టి.పల్లవి,బి. సోను నిర్వహించారు. ఈ సందర్భంగా వేప కషాయం ద్వారా జాసిడ్స్,తెల్లదోమ, ఇతర పీల్చే పురుగులను నియంత్రించవచ్చని తెలిపారు.కొన్ని రకాల పురుగులు మొక్కలపై గుడ్లు పెట్టకుండా నిరోధించే ప్రభావం కూడా వేప కషాయానికి ఉంటుందని వివరించారు.రైతులు స్వయంగా వేప కషాయాన్ని తయారు చేసుకుని వినియోగించడం ద్వారా రసాయనిక పురుగుమందులపై అయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతులు మస్కురి చంద్రయ్య, కిష్టారెడ్డి, ఐలయ్య, రామయ్య, సుధాకర్, బాల్ నర్సయ్య తదితరులు ఉన్నారు.

### అనారోగ్యంతో బాధపడుతున్న
# బత్తుల కనకయ్యకు ఆర్థికసాయం

నంగునూర్ అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి):- మండలం గట్లమల్యాల గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు బత్తుల కనకయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు ఈ విషయంను గట్లమల్యాల గ్రామ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి కనకయ్య కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సాయాన్ని పంపించారు. అలాగే మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్ రెడ్డి రూ. 5,000 ఆర్థిక సాయం



మంగళవారం నాడు అందించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో తమకు ఆర్థికంగా అండగా నిలిచిన వంగ రాజేశ్వర్ రెడ్డి ప్రకాష్ రెడ్డి బత్తుల కనకయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్లమల్యాల మాజీ సర్పంచ్ తిప్పని రమేష్ మాజీ ఎంపీటీసీ ఓజల్ సంతోష్ నగర్ సర్పంచ్ సరోజినీ నాయక్ రంగు వెంకన్న, మంతూరి మల్లేశం, దండ్ల మల్లేశం, అమరేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### సేవా జ్యోతి కలశ యాత్ర విజయవంతం చేయాలి

- హాజరు కానున్న ఎంపీ రఘునందన్ రావు
- బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 6(ప్రజాజ్యోతి):-ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 7న సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సేవా జ్యోతి కలశ యాత్రను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం అయన మాట్లాడుతూ బుధవారం నాడు కొండ మల్లయ్య గార్డెన్ లో ఉదయం 10 గంటలకు ప్రధాని మోడీ వర్చువల్ ప్రసంగాన్ని వీక్షించేందుకు ఎల్ఈడీలు ఏర్పాటు చేశామన్నారు.ప్రధాని ప్రసంగం అనంతరం గార్డెన్ నుండి పాత బస్టాండ్ మీదుగా వెంకటేశ్వర దేవాలయం వరకు సేవా జ్యోతి కలశ యాత్ర ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ రఘునందన్ రావు పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు అధిక సంఖ్యలో బైకులతో వచ్చి కలశ యాత్రలో యాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## కొత్తగట్టు వద్ద ర్యాంపు నిర్మాణం చేపట్టాలి

గ్రామస్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 6( ప్రజాజ్యోతి ): కొత్తగట్టు స్టేజి వద్ద జాతీయ రహదారి నిర్మాణంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు రహదారిని సురక్షితంగా దాటేందుకు వీలుగా క్రాసింగ్ వద్ద ర్యాంపు నిర్మాణం చేపట్టాలని



సూచించారు.కొత్తగట్టు వద్ద జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తమ గ్రామానికి వెళ్లేందుకు సరైన ర్యాంపు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. అండర్‌పాస్‌ల నుంచి గ్రామస్తులు సాఫీగా రాకపోకలు సాగించేలా ఒక వైపు ఇప్పటికే నిర్మించిన ర్యాంపుతో పాటు మరో వైపు కూడా ర్యాంపు నిర్మించాలని కోరారు.గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం రాత్రి తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, జాతీయ రహదారి-563 ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్ తదితర అధికారులతో కొత్తగట్టు వద్ద నెలకొన్న పరిస్థితిపై చర్చించారు.కొత్తగట్టు వద్ద ర్యాంపు లేకపోవడంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారు చేసిన విజ్ఞప్తి, సమస్యకు పరిష్కార మార్గాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్రాసింగ్ వద్ద ర్యాంపు నిర్మాణానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు.

## సాయిలు తాత ఇక లేరు..

గ్రామ సమస్యలకు పెద్దదిక్కుగా నిలిచిన పాలకుర్తి సాయిలు



ఎండపల్లి, అక్టోబరు 6, ప్రజాజ్యోతి: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన పాలకుర్తి సాయిలు (సాయిలు తాత) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన మాజీ సర్పంచ్ పాలకుర్తి విజయకు మామ.గ్రామానికి సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రజల సమస్యలను తనవిగా భావించి పరిష్కారానికి చొరవ చూపడంతో సాయిలు గ్రామస్థులకు ఆత్మీయుడిగా మారారు. కోడలు సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలో జరిగే పలు కార్యక్రమాల్లో పరోక్షంగా,భాగస్వామ్యమవుతూ తనదైన ముద్ర వేశారు. గ్రామస్థులు ఆయన సేవాభావాన్ని గుర్తించి ప్రేమతో 'సర్పంచ్ సాయిలు' అని పిలిచేవారు.సర్పంచ్ పదవీకాలం ముగిసిన తర్వాత కూడా గ్రామ వ్యవహారాలకు ఆయన దూరం కాలేదు. కుటుంబ, భూ తగాదాలు, ఇతర స్థానిక సమస్యలు తలెత్తినప్పుడు ఇరువర్గాలతో మాట్లాడి సామరస్య పరిష్కారానికి కృషి చేసేవారు. చిన్నచిన్న వివాదాలు పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లకుండా గ్రామస్థాయిలోనే చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నించేవారు. పెద్దమనిషిగా ఆయన ఇచ్చే సూచనలు, నచ్చజెప్పే తీరు పలువురికి ఆత్మీయంగా ఉండేది.అందుకే సాయిలు కేవలం ఒక కుటుంబానికి చెందిన వ్యక్తిగానే కాకుండా గ్రామంలో అందరికీ తెలిసిన పెద్దమనిషిగా గుర్తింపు పొందారు. వయసులో పెద్దవారితో గౌరవంగా, యువతతో ఆప్యాయంగా మెలిగేవారు. ఈ అనుబంధంతోనే గ్రామస్థులు ఆయనను ప్రేమగా 'సాయిలు తాత'గా పిలుచుకునేవారు. ఆయన మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది. పలువురు గ్రామస్థులు సాయిలు మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి

మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్, అక్టోబరు 6: ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల, బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యుత్ వ్యవస్థ, పరిసరాలు, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో కొన్ని గదుల తలుపులు సరిగా లేవని, విద్యుత్ వైరింగ్‌లో సమస్యలు ఉన్నాయని గుర్తించిన కలెక్టర్.. అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల గ్రాంట్ ద్వారా అవసరమైన నిధులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా మైదానంలో గ్రౌండ్ లెవెలింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించడంతోపాటు, ఇంటర్మీడియట్‌లో జిల్లా స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డీ బుల్బీ కౌర్, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల అవసరాలకు అండగా కొలిపాక సంపత్

తెనుగువాడ ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ బాక్స్ బహూకరణ

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 6, ప్రజా జ్యోతి: విద్యార్థుల అవసరాలను గుర్తించి పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు 18వ వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్ ముందుకు వచ్చారు. పెద్దపల్లి పట్టణంలోని 18వ



వార్డు తెనుగువాడ ప్రభుత్వ పాఠశాలకు తన సొంత సహకారంతో సౌండ్ బాక్స్‌ను బహూకరించారు. పాఠశాలలో ప్రార్థనలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాల నిర్వహణకు సౌండ్ బాక్స్ ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా కొలిపాక సంపత్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు అవసరమైన మరిన్ని సౌకర్యాల కల్పనకు కూడా తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. సౌండ్ బాక్స్‌ను అందించిన కౌన్సిలర్ కొలిపాక సంపత్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అవసరాలను గుర్తించి సౌండ్ బాక్స్ అందించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు కూడా కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ చైర్మన్ కొలిపాక నర్సయ్య, గంగుల సతీష్, భూతగడ్డ తిరుపతి, వేల్పుల రాజేశం, మౌటం శంకర్, ఆశాలు, వేల్పుల సంతోష్, గంగుల సంతోష్, కొలిపాక రాము, కొలిపాక గంగారాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి గర్జన

**ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ**

**సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించి విచారణ జరిపించాలి**

**కలెక్టర్‌కు వినతిపత్రం.. దిష్టిబొమ్మ దహనం**

రీంనగర్ బ్యూరో,అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా ఓట్ల చోరీ, ఎన్నికల సంఘం వ్యవహారశైలికి వ్యతిరేకంగా కరీంనగర్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లిన నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌తో పాటు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా నాయకులు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నేతలు మాట్లాడుతూ ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని, సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తక్షణమే తొలగించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి తమ డిమాండ్లను పంపించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో



అనుమానాలు కలిగేలా వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం తీరును ప్రశ్నించారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నికల సంఘం బీజేపీకి అనుబంధ విభాగంగా మారినట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అణగారిన వర్గాల ఓట్ల తొలగింపు ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్ల తొలగింపుపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైన హక్కు అని, దాన్ని పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేయడం ద్వారా నిరసన వ్యక్తం చేశామని, ఆయనను పదవి నుంచి తొలగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని అన్నారు.కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకుంటామని తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు అంబటి జోజి రెడ్డి



రాహుల్‌గాంధీ చేపడుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. జ్ఞానేష్‌కుమార్‌ను అరెస్టు చేయాలని కూడా ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఓడితల ప్రణవ్‌బాబు, ఊట్కూరు నరేందర్‌రెడ్డి, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, బండారి శేఖర్, జిన్నం ప్రసాద్, పైడిపల్లి రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్ నాయక్, హేమంత్‌తో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో ప్రగతి పథంలో సారంగాపూర్

సర్పంచ్ చేకుట అరుణ-శేఖర్ హర్షం

సారంగాపూర్, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో మంగళవారం జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో పలు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. సారంగాపూర్ గ్రామంలో నూతన డ్రైనేజీ వ్యవస్థ, సి.సి. రోడ్ల నిర్మాణ పనులతో పాటు మహిళా సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే స్థానిక రామాలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న మరుగుదొడ్ల పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం, గ్రామంలో లో-వోల్టేజీ సమస్యను అధిగమించి, నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ డీటీఆర్ (ట్రాన్స్‌ఫార్మర్)ను ఆయన ప్రారంభించారు.



**లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ:**

అనంతరం స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్యాణ లక్ష్మి మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చేకుట అరుణ-శేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నారు. గ్రామంలో నూతన డ్రైనేజీ, సి.సి రోడ్లు మరియు డీటీఆర్ ప్రారంభంతో విద్యుత్ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని, ఎమ్మెల్యే చొరవతోనే గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోందని హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘ భవనానికి నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక మహిళలు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌లు సొల్లు సురేందర్, పుష్పనాథ్, శ్రీనివాస్, కోలపాక రాధ-రాజు, సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనంతారంలో బతుకమ్మ నిమజ్జనంకు ఏర్పాట్లు

ఇల్లంతకుంట అక్టోబర్ 6(ప్రజా జ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో సద్దుల బతుకమ్మ నిమజ్జనం కోసం మంగళవారం రోజు గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని బ్రిడ్జి



సమీపంలో ఉన్న చెత్త చెదారం ముళ్ల పొదలను ఎక్స్‌వేటర్ సహాయం తో తొలగించి మహిళలు, గ్రామస్తులు నిమజ్జన స్థలానికి వెళ్ళందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చదును చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ రజిత వెంకటేష్ పంచాయతీ సెక్రెటరీ మారుతి ఉప సర్పంచ్ కదం జయంత్, వార్డ్ సభ్యులు మల్యాల రాజశేఖర్, పీటర్,రమేష్,నాయకులు నర్సయ్య, గోనెపల్లి వెంకటేష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాకల్ దేవ్ పల్లిలో ఫామ్ పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించిన సర్పంచ్

ఎలిగేడు, అక్టోబర్ 6: (ప్రజా జ్యోతి): ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో వీబీజీ రాంజీ పథకం కింద ఫామ్ పాండ్ నిర్మాణ పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ప్రారంభించారు. సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్



మాట్లాడుతూ.. గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఫామ్ పాండ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఫామ్ పాండ్‌లో వర్షపు నీరు నిల్వ ఉండటం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. వర్షపు నీటిలో ప్రతి బిందువును సంరక్షించి, భవిష్యత్ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఫామ్ పాండ్ నిర్మాణంతో రైతులకు, గ్రామానికి అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని, భూగర్భ జలాల పెంపునకు ఇది దోహదపడుతుందని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంతో పాటు గ్రామంలో నీటి సంరక్షణకు ఈ పనులు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. గ్రామంలో నీటి సంరక్షణ, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడిగె శివకృష్ణ కార్యదర్శి కుక్క అశోక్ ,ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పుట్టింటి ప్రయాణంలో పసిడి జాగ్రత్త!

**మహిళలు అప్రమత్తంగా ఉండాలి :కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ**

**పుట్టింటికి వెళ్లే సమయంలో ఆభరణాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**

కోరుట్ల, అక్టోబర్ 6 ప్రజాజ్యోతి: దసరా పండుగను పురస్కరించుకుని మహిళలు పుట్టింటికి వెళ్లే సమయంలో తమ వెంట తీసుకెళ్లే బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే. లక్ష్మీనారాయణ సూచించారు. పండుగ సమయంలో ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లే సందర్భాలను



దొంగలు ఆసరాగా చేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

**- పండుగ ప్రయాణాల్లో అప్రమత్తతే రక్షణ:**

దసరా పండుగ సందర్భంగా మహిళలు, కుటుంబ సభ్యులు పుట్టింటికి లేదా బంధువుల ఇళ్లకు వెళ్లడం సాధారణమని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సమయంలో ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను ఉంచి వెళ్లకుండా సాధ్యమైనంత వరకు సురక్షిత ప్రదేశంలో భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే విషయాన్ని ఇతరులకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

**- బంగారు ఆభరణాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు:**

పండుగల సమయంలో మహిళలు ఎక్కువగా బంగారు ఆభరణాలు ధరించి ప్రయాణాలు చేసే అవకాశం ఉంటుందని, అందువల్ల బస్సులు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, దేవాలయాల వద్ద మరింత జాగ్రత్తగా ఉండాలని సీఐ సూచించారు. ప్రయాణ సమయంలో నగలు కనిపించేలా కాకుండా భద్రంగా ఉంచుకోవాలని, అపరిచిత వ్యక్తులు ఇచ్చే సహాయాన్ని వెంటనే నమ్మవద్దని తెలిపారు.

**- ఇల్లు వదిలి వెళ్లే ముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి:**

ఇంటికి తాళం వేసి పండుగకు వెళ్తున్న వారు విలువైన వస్తువులను ఇంట్లో బహిరంగంగా ఉంచకూడదని సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. ఇంటి తలుపులు, కిటికీలు సక్రమంగా మూసి ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాతే బయటకు వెళ్లాలని చెప్పారు. వీలైనంత వరకు ఇంటి పరిసరాల్లో నమ్మకమైన వ్యక్తులకు సమాచారం అందించి, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం:**

పండుగ వేళల్లో కాలనీలు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల సీఐ కే. లక్ష్మీనారాయణ సూచించారు. ఎలాంటి అనుమానం కలిగినా ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

**- ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత:**

పండుగను ప్రజలంతా ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, అయితే ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ అప్రమత్తంగా వ్యవహరించినప్పుడే నేరాలను మరింత సమర్థవంతంగా అరికట్టగలమని ఆయన పేర్కొన్నారు.

## మహిళ ఆత్మహత్య యత్నం

గంగాధర 06/అక్టోబర్/2026 (ప్రజా జ్యోతి): మండలంలోని చర్లపల్లి (ఆర్) గ్రామానికి చెందిన మహంకాళి రజిత అనే మహిళా ఉపాధి హామీ మెటీగా గత రెండు సంవత్సరాల నుండి పని చేస్తుందని స్థానికులు తెలిపారు. ఇటీవల గ్రామ సర్పంచ్ ఎట్టపు కనకయ్య బాడీ మీటింగ్లో తీర్మానం చేసి రజితను, ఎలాంటి కారణం లేకుండా దళిత మహిళా అనే నెపంతో పక్కకు పెట్టడంతో మనస్తాపం చెంది అత్మ హత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆమె స్థానంలో గతంలో వెంకటేష్ అనే వ్యక్తిని పెట్టుకోవడం జరిగిందన్నారు. వెంకటేష్ అనే వ్యక్తి గతంలో 20 దొంగ మాస్టర్లు వేసి దొరకడంతో డిఎల్పిఓ, ఎంపిఓ, పని నుండి తొలగించారన్నారు. అటువంటి వ్యక్తిని మళ్లీ పెట్టుకోవడంతో మనస్థాపనం చెందిన మహంకాళి రజిత.. నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడటంతో గ్రహించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



## హర్ ఘర్ జల్ కార్యక్రమంపై అవగాహన కల్పించిన సర్పంచ్ రమాదేవి సంపత్

ఎలిగేడు, అక్టోబర్ 06 (ప్రజా జ్యోతి ): మండలం లోని ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటి వినియోగంపై అవగాహన కల్పించారు.



కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఉండేలా చూసుకోవడం, నల్లా కనెక్షన్ల వినియోగం, తాగునీటి వృథాను అరికట్టడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. అలాగే గ్రామంలోని వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి కలుషితాన్ని నివారించడం వంటి జాగ్రత్తలను వివరించారు. సురక్షితమైన తాగునీటిని వినియోగించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని, ప్రతి కుటుంబం నీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ సూచించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుక్క అశోక్ వార్డ్ సభ్యులు సతీష్ గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడు అంజిరెడ్డిని పరామర్శించిన మట్టా



**సత్తుపల్లి అక్టోబర్06(ప్రజా జ్యోతి)** తెలంగాణ ఉద్యమకారుడు వేంసూర్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన బండి అంజిరెడ్డి అనారోగ్య కారణంగా జూపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్నా రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ హాస్పిటల్ కు వెళ్లి ఆయనను పరామర్శించారు. అక్కడ వైద్యం అందిస్తున్న వైద్యులతో మాట్లాడి, ఆయన యోగక్షేమాలను తెలుసుకున్నారు. అండగా ఉంటాను ఆ ధైర్య పడవద్దు హామీ ఇచ్చారు. ఆయనను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి ఏ.ఎం.సి వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్పారెడ్డి, నరుకుల్ల అప్పారావు,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## నిరుపేదల సంక్షేమం కోరేది కాంగ్రెస్ పార్టీ మట్టా

★ సొంత ఇంటి కల కోసం స్థలాన్ని పరిశీలించిన మట్టా



**సత్తుపల్లి అక్టోబర్06(ప్రజా జ్యోతి)** నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు పెనుబల్లి మండలంలో ముత్తగూడెం గ్రామంలో రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు నుండి సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఇబ్బంది పడుతున్నారని, కుటుంబాలు పెరుగుతుండటంతో ఉండేందుకు ఇల్లు సరి పోని పరిస్థితి కాబట్టి,నిరుపేదలకు స్థలాలు అందజేసి,ఇల్లు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ తోనే నిరుపేదలన్నది చేకూరుతుందని ఆయన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి సొంత ఇంటి కల నెరవేరితే వారి జీవితంలో గొప్ప అచీవ్మెంట్ పొందిన వారు అవుతారు కాబట్టి,వారి కల తీర్చేందుకు చేయూతగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని అన్నారు. సుమారు రెండు ఎకరాల భూమి నిరుపేదలకు పంపిణీ చేసి,పట్టా అందించేందుకు ఏర్పాటు చేసి, ఇల్లు నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సహించం

★ విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
★ సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్



**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 6, ప్రజాజ్యోతి :** లంబాడీ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఎస్టీ హోదాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ డిమాండ్లు చేయడం సరికాదని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు గిరిజన సమాజంలో విభేదాలు, విద్వేషాలను పెంచేలా ఉన్నాయని పేర్కొన్నారు. సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వెంకటేష్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లంబాడీలకు లభిస్తున్న ఎస్టీ హోదా రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఆయన పేర్కొన్నారు. ఒక సామాజిక వర్గాన్ని పదేపదే లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సమాజంలో అనవసర ఉద్రిక్తతలకు దారితీస్తుందని అన్నారు. లంబాడీ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ప్రజాస్వామ్య, రాజ్యాంగ పద్ధతుల్లో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించేలా, విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించే వ్యక్తులు, సంస్థలపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య శాంతి, సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అసత్య ప్రచారాలతో సామాజిక ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, కిరణ్ నాయక్, భరత్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

★ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
★ 2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ ఓటర్ల జాబితా తయారీ
★ ఫారం-18 దరఖాస్తులకు నవంబర్ 6 చివరి గడువు
★ అర్హులైన ప్రతి పట్టభద్రుడికి సమాచారం అందేలా విస్తృత ప్రచారం



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా తయారు చేస్తున్నందున,అర్హత కలిగిన పట్టభద్రులు తప్పనిసరిగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.2023 అక్టోబర్ 31 నాటికి పట్టభద్రులైన వారు అర్హులుగా, 2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను కొత్తగా తయారు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 2027 మార్చిలో శాసనమండలిలో ఏర్పడ నున్న ఖాళీ నేపథ్యంలో ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఫారం-18 సమర్పించాలి.వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరుగా నమోదుకు అర్హత ఉన్న పట్టభద్రులు ఫారం-18లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు సంబంధిత ఏఈఆర్ఓ/అధికారికి ఫారం-18ను నేరుగా కూడా అందజేయవచ్చని తెలిపారు. అవసరమైన ఆధార పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలని సూచించారు.ఫారం-18 దరఖాస్తులు సమర్పించేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని కలెక్టర్ స్పష్టం చేశారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా అర్హులైన పట్టభద్రులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నవంబర్ 20 నాటికి ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి, నవంబర్ 25న ప్రచురిస్తారని, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సవరణలకు దరఖాస్తులు స్వీకరిస్తారని, తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 30న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.విద్యాసంస్థలు, బ్యాంకుల్లో ప్రచారం చేయాలి.జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, సర్వీస్ అసోసియేషన్లు, ఇతర సంస్థల అధికారులు తమ పరిధిలోని అర్హత కలిగిన పట్టభద్రులకు ఈ విషయాన్ని తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.డిగ్రీ, పీజీ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు సమాచారం పంపించి అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ అన్ని బ్యాంకులకు సమాచారం అందించి అర్హులైన ఉద్యోగులు, పట్టభద్ర ఖాతాదారులకు విషయం తెలియజేయాలని తెలిపారు.తహసీల్దార్లు, ఏఈఆర్ఓలు తమ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.మండల కేంద్రాలు, గ్రామాల్లో టామ్టామ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రతిరోజూ ప్రచారం నిర్వహించాలని తెలిపారు.అర్హులైన పట్టభద్రులకు ఫారం-18 ఎలా సమర్పించాలి, చివరి తేదీ నవంబర్ 6 అనే విషయాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.స్థానిక సిబ్బంది ద్వారా కూడా సమాచారాన్ని ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఏడు సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు

★ జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వానాకాలం 2026-27 ధాన్యం కొనుగోలు సీజన్ అక్టోబర్ 2026 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ, ఆయా రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి, అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ మేరకు జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన కనీసం ఒక సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఆదేశించిందని, నియమితులయ్యే సిబ్బందికి వ్యవసాయంలో బి.ఎస్సీ లేదా డిప్లొమా విద్యార్హతతో ఉండేలా చూడనున్నామన్నారు.ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం అందిస్తామన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి లను సంప్రదించవచ్చున్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ, ప్రభుత్వం గుర్తించిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో కలెక్టర్ దివాకర్ టిఎస్ ఆకస్మిక తనిఖీ

★ రోగులకు అందుతున్న వైద్య సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలన
★ ఓపీ రిజిస్ట్రేషన్, మందుల పంపిణీ కౌంటర్లు పెంచాలి
★ ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం, సకాలంలో సేవలు అందించాలి








**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందేలా వైద్యులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సోమవారం రాత్రి ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రాత్రి సమయంలో ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.అదనపు కలెక్టర్తో కలిసి ఆసుపత్రి ఆవరణలోని వివిధ విభాగాలను కలియతిరుగుతూ పరిశీలించిన కలెక్టర్, రాత్రి వేళ ఆసుపత్రిలో వైద్య సేవల పరిస్థితి, ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, మందుల పంపిణీ, ఔషధాల నిల్వలు, రోగులకు కల్పిస్తున్న మౌళిక సదుపాయాలు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు,వైద్యులకు కలెక్టర్ దివాకర టిఎస్ పలు సూచనలు చేశారు.ఆసుపత్రికి వచ్చే రోగులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. రోగుల రద్దీకి అనుగుణంగా అవసరమైన చోట అదనపు ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని,మందుల కోసం రోగులు క్యూ లైన్లలో ఉండకుండా ఔషధాల పంపిణీ కౌంటర్ల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.ప్రతి రోగికి అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ఔషధాల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,అత్యవసర మందులకు కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం, సకాలంలో వైద్య సేవలు అందించాలని. వైద్యులు,నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఇతర సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవంగా, బాధ్యతతో పరిగణిస్తూ అవసరమైన వైద్య సేవలను వేగంగా అందించాలని సూచించారు.ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో వైద్య సేవలు పొందేలా ఆసుపత్రుల్లో సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని కలెక్టర్ తెలిపారు. రోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలోని మౌలిక వసతులు, ఇతర ప్రజా సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.రాత్రి సమయంలో కూడా వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం పనిచేయాలని, ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే గుర్తించి సరిదిద్దాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ తనిఖీల సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.నరేందర్, ఆర్ఎంఓ,పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ ఆదాయాన్ని పెంచాలి



**ఇల్లందు, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి)** ఇల్లందు వ్యవసాయ మార్కెట్ ఆదాయాన్ని పెంచాలని, అందుకు పాలకవర్గం, సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా తిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. మార్కెట్ పరిధిలో టేకులపల్లి సబ్ యార్డ్ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, కామేపల్లి మండలంలో నూతన సభ్యులు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, వైస్ చైర్మన్ బిజ్జా వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, డైరెక్టర్లు కుంజా వసంతరావు, జారే సమ్మక్క, బొల్లి రాజు, గుగులోత్ గబ్రు, మాలోత్ బావు సింగ్, భూక్య శివలాల్ నాయక్, బానోత్ జింకు, ఊకె బుచ్చయ్య, జిగట వెంకన్న, మార్కెట్ జెయంఎస్ పిక్లా నాయక్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మహిళలకు బాత్రూములు కరువు!

★ 30--40 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే ప్రజలకు కనీస వసతులు కరువు
★ రైతు వేదికల్లోనూ అదే పరిస్థితి.. ఆసుపత్రిలో ఉన్న ఒక్క బాత్రూమ్కు తలుపులే లేవు!
★ ప్రజల ఇబ్బందులపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి




**అశ్వారావుపేట: ప్రజా జ్యోతి అక్టోబర్ 6** ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కనీస వసతులు కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే వారు బాత్రూమ్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. అశ్వారావుపేట మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 30--40 కిలోమీటర్ల దూరం నుంచి ప్రజలు వివిధ ప్రభుత్వ పనుల కోసం వస్తుంటారు. రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, రైతు వేదిక తదితర ప్రాంతాలకు ప్రతిరోజూ ప్రజల రాకపోకలు ఉంటాయి. అయితే ఇంతమంది ప్రజలు వచ్చే చోట్ల కనీసం బాత్రూమ్ సౌకర్యం లేకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

**రైతు వేదికల్లోనూ బాత్రూములు లేవా?**

ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో కూడా బాత్రూమ్ సౌకర్యాలు లేవని ప్రజలు చెబుతున్నారు. సమావేశాల కోసం గంటల తరబడి అక్కడ ఉండాల్సి వచ్చినప్పుడు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్కటే..**
**దానికి తలుపులు కూడా లేవు!**

ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉందని ప్రజలు అంటున్నారు. ఉన్న ఒక్క బాత్రూమ్కు సైతం తలుపులు లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఇటువంటి పరిస్థితుల్లో ఎలా ఇబ్బందులు పడాల్సి వస్తుందో అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

**సమస్య చెప్పుకోవాలంటే ఎవరికి?**

ప్రజల నుంచి పన్నులు, వివిధ రుసుములు వసూలు చేస్తున్న ప్రభుత్వ వ్యవస్థలో వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ప్రభుత్వ కార్యాలయాల్లోనే బాత్రూమ్ సౌకర్యాలు లేకపోతే తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన నేపథ్యంలో పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్స్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ఇప్పటికే ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, రైతు వేదికలు, ఆసుపత్రుల్లో మరియు ఎమ్మార్వో ఆఫీస్ లో అలాగే ఎంపీడీవో ఆఫీసులో కూడా బాత్రూములు లేవంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అవసరమైన మేరకు ప్రత్యేక బాత్రూమ్లను నిర్మించి, వాటి నిర్వహణకు కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**మహిళల గౌరవం.. అధికారుల బాధ్యత**

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే మహిళలకు కనీస సౌకర్యం కల్పించడం కేవలం మౌలిక వసతి కాదు.. వారి గౌరవం, భద్రతకు సంబంధించిన అంశమని అధికారులు గుర్తించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను చిన్న విషయంగా తీసుకోకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సద్దుల బతుకమ్మకు అన్ని వసతులు కల్పించాలి



**ఇల్లందు, అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి)** మున్సిపల్ పరిధిలోని 24 వార్డుల్లో మహిళలకు సద్దుల బతుకమ్మకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మున్సిపల్, పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను ఇల్లందు పట్టణంలోని అన్ని వార్డుల్లో మహిళలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఇల్లందు పట్టణంలోని 24 వార్డుల్లోనూ బతుకమ్మ పండుగను మహిళలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారని, ఈ నేపథ్యంలో ప్రతి వార్డులో బతుకమ్మ ఆడే ప్రదేశాలను ముందుగానే గుర్తించి పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లు, అవసరమైన ప్రదేశాల్లో బ్లీచింగ్ తదితర వసతులు కల్పించాలని సూచించారు. బతుకమ్మ ఆడే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య సిబ్బంది, చెత్త తొలగింపు వంటి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులను కోరారు. అలాగే పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఒకే ప్రదేశంలో చేరే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు కూడా భద్రతా చర్యలు చేపట్టి, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకలు ప్రతి వార్డులో ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో, మహిళలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా జరిగేలా మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ భద్రత

### క్యూలైన్లు, పార్కింగ్ స్థలాల పరిశీలన ఏర్పాట్లపై సీపీ ఎన్.శ్వేత ఆరా

హన్మకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 06, (ప్రజా జ్యోతి): వరంగల్ నగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్రంలోని వివిధ





ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆలయ పరిసరాలు, భక్తుల క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, భద్రతా విభాగాలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణ, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్‌రావు, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్లు, ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వినియో గించి పంటలను కాపాడుకో వాలి

### ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి): ఎల్‌నినో ను దృష్టిలో ఉంచు కుని రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పా యల్ శంకర్ కోరారు. మంగళవారం కోర్టా–చనాకా ప్రాజె క్టు నుంచి సాగునీటిని విడు దల చేసిన కార్యక్రమంలో ఎ మ్మెల్యే పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ తక్కువ వర్షపాతం, ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయి లో నీటి ప్రవాహాలు లేకపోవ డం, ఎల్‌నినో ప్రభావం వం టి పరిస్థితుల నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను జాగ్రత్త గా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్ర ధాన కాలువల ద్వారా వచ్చే నీటిని స్థానిక చెరువులు, కుంటలు, వాగులు, ఇతర నీటి వనరులను నింపేలా సమర్థవంతంగా వినియో





గించుకోవాలని సూచించా రు. ఇందుకోసం స్థానిక ప్ర జాప్రతినిధులు, నాయకు లు, అధికారులు సమన్వ యంతో పనిచేసి నీటి విని యోగంలో సామర్థ్యాన్ని పెం చాలని కోరారు.రైతులు పం టలకు అవసరమైన మేరకే నీటిని వినియోగిస్తూ వృథా ను నివారించాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమష్టి కృషితో అందుబా టులో ఉన్న నీటితో పంటల ను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అ ధికారులు నాయకులుగిమ్మ సర్పంచ్ సన్నీ,అకోలి సర్పంచ్ శంభు,బోరజ్ సర్పంచ్ సాయి వర్మ, కామాయి స ర్పంచ్ వికాస్, లేఖరవాడ సర్పంచ్ ప్రభాకర్,అశోక్ రెడ్డి, భూమన్న, రాందాస్, శైలేంద ర్, రమేష్, విశాల్ తదితరు లు పాల్గొన్నారు.

## మీడియా అకాడమీ చైర్మన్ పర్యటనను విజయవంతం చేయాలి

### వర్కింగ్ జర్నలిస్టుల శిక్షణా తరగతులకు విస్తృత ఏర్పా ట్లు

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజాజ్యోతి): తెలంగాణ మీడియా అకాడ మీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించ నున్న వర్కింగ్ జర్నలిస్టుల రెండు రోజుల శిక్షణా తరగ తులకు సంబంధించిన ఆ హ్వానాన్ని మీడియా ప్రతిని ధులు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్లకు మంగళవారం అం దజేశారు.ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ పర్యటనతో పాటు శిక్షణా కార్యక్రమానికి సంబంధించి న ఏర్పాట్లు, ప్రొటోకాల్ చ ర్యలపై కలెక్టర్, ఎస్పీలకు వి వరించారు. కార్యక్రమం స జావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసర మైన ఏర్పాట్లపై చర్చించా రు. జిల్లాలోని జర్నలిస్టులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని మీడి యా ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఇ. వి ష్ణువర్ధన్, మీడియా ప్రతినిధులు దేవేందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీ నామా చేయాలి

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ జాదవ్**

**సర్ ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**

**ఆదిలాబాద్ లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో కలె క్టరేట్ ఎదుట భారీ నిరసన**

ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 6,(ప్రజా జ్యోతి): ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవరణలో చోటు చేసుకుంటున్న పరి ణామాలు,




కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియలో పా రదర్శకతపై ఆందోళన వ్య క్తం చేస్తూ ఇండియా కూట మి ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ నాయక త్వంలో మంగళవారం కలెక్ట రేట్ ఎదుట భారీ నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహిం చారు. జిల్లా కాంగ్రెస్ కార్యా లయం నుంచి డా. నరేష్ జాదవ్, ఆదిలాబాద్ నియో జకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీని వాస్ రెడ్డి, బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రె టరీ గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కూటమిలోని సిపిఐ, సపిఎం, ఏఐఎంఐఎం, ఆప్, తదితర పార్టీల నాయకులు వందలాది మంది నాయకు లు, కార్యకర్తలు ర్యాలీగా క లెక్టరేట్‌కు చేరుకున్నారు.కలె క్టరేట్ ఎదుట నిర్వ హించిన ధర్నాలో "సీఈసీ జ్ఞానేష్ కు మార్ రాజీనామా చేయా లి", "ఓట్ చోర్ గద్దే ఛోడ్", "మోదీ డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేస్తూ కేంద్ర ప్ర భుత్వానికి, ఎన్నికల సం ఘానికి వ్యతిరేకంగా నిరస న వ్యక్తం చేశారు.

ఈ సంద ర్భంగా డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ, రాజ్యాంగ బ ద్ధ సంస్థల స్వతంత్రతను దె బ్బతీసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, వచ్చే ఎన్నికల్లో రా జకీయ లబ్ధి పొందేందుకు ఎన్నికల వ్యవస్థను ప్రభావి తం చేసే కుట్రలకు పాల్పడు తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వా సం నిలవాలంటే ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకం గా, నిష్పక్షపాతంగా ఉండా లని అన్నారు.ఇటీవల వెలు వడిన పరిశోధనాత్మక కథ నాలను ప్రస్తావిస్తూ, ఎన్నిక ల కమిషనర్లు సుఖ్‌బీర్ సిం గ్ సంధు, డా. వివేక్ జోషి గత పది నెలల్లో పలు సంద ర్భాల్లో ఎన్నికల సంఘం ని ర్ణయాలు, ఆదేశాలపై అధి కారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయని డా. న రేష్ జాదవ్ తెలిపారు. ఈ అంశాలపై ఎన్నికల సంఘం పూర్తి వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాల ని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియలో అర్హత కలిగిన ఒ క్క ఓటరు పేరు కూడా అ న్యాయంగా తొలగించకూడ దని ఆయన అన్నారు. ఓట ర్ల జాబితా నుంచి పేరు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు తగిన నోటీసు ఇ వ్వడంతో పాటు, తన వాద న వినిపించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ హక్కును పరిరక్షించడం ఎన్నికల సం ఘం ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నికల సం ఘం విశ్వసనీయత, సంస్థా గత స్వతంత్రత, ప్రజల న మ్మకాన్ని కాపాడేందుకు ప్ర ధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్



కుమార్ తన పదవి కి రాజీనామా చేయాలని డా. నరేష్ జాదవ్ డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల మధ్య నమోదైనట్లు నివేదిం చబడిన అభ్యంతరాలు, సం బంధిత ఫైళ్లు, అంతర్గత నో ట్లు, సమావేశాల మినిట్స్ ను చట్టపరమైన పరిమితు లకు లోబడి పారదర్శకంగా వెల్లడించాలని, సర్ లో ఓట ర్ల పేర్ల తొలగింపు పునరుద్ధ రణ విధానంపై స్వతంత్ర స మీక్ష చేపట్టాలని కోరారు.

అనంతరం ఆర్డీఓ కి వినతి పత్రం సమర్పించారు. ఈ కా ర్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి,మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, బోథ్ మార్కెట్ చైర్మన్ మల్లెపూల సత్యనారాయ ణ, ఆదిలాబాద్ ఆత్మ కమి టీ చైర్మన్ గిమ్మ సంతోష్, ప ట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖి జర్ పాషా, ఈ కార్యక్రమం లో మాజీ డీసీసీ సాజిద్ ఖా న్, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, సిపిఐ ప్రభాకర్ రెడ్డి, సిపిఎం పార్టీ నుండి బండి దత్తాత్రే, సిపి ఎం డిస్ట్రిక్ట్ సెక్రటరీ మల్లేష్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డిస్టిక్ సెక్రెటరీ జగన్ సింగ్, ఎం సిపిఐ కుంటాల రాము లు, ఆమ్ ఆద్మీ పార్టీ నుండి రాథోడ్ సుభాష్, సిపిఐ ఎం ఎల్ నుండి మడావి గణేష్, తదితరులు పాల్గొన్నారు. ఎ స్సీ విభాగం చైర్మన్ పరమే శ్వర్, ఎస్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు సేద్మకి ఆనంద్ రావు, జిల్లా కాంగ్రెస్ మహి ళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ, మైనారిటీ కాంగ్రె స్ అధ్యక్షులు షాహిద్,యూ త్ కాంగ్రెస్ ఆదిలాబాద్ అ సెంబ్లీ అధ్యక్షులు నాహిద్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, జిల్లా కాం గ్రెస్ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు,మం డల కాంగ్రెస్ అధ్యక్షులు,మున్సిపల్ కౌన్సిలర్లు, టౌన్ కాం గ్రెస్ నాయకులు, వివిధ వి భాగాల ప్రతినిధులు, మహి ళా కాంగ్రెస్, యు వజన కాం గ్రెస్,ఎన్ఎస్ యుఐ, సేవా దళ్ నాయకులు, కార్యకర్త లు తదితరులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

# దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ కమ్యూనిటీ కిచెన్

మొదటిపేజీ తరువాయి..

స్కూళ్లకు రవాణా చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. ఆధునిక వంట పరికరాలు, పరిశుభ్రమైన ఆహార తయారీ సదుపాయాలతో ఈ గ్రీన్‌ఫీల్డ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందుబాటులోకి రానుంది. పాఠశాలకు వచ్చే పిల్లలకు ఉదయం పూట పౌష్టికాహారం అందడం వల్ల వారి ఆరోగ్యం, చదువుపై ఏకాగ్రత మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి సంస్థ రూ.9.60 కోట్ల నిధులను సమకూర్చినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తనతో పాటు కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ ప్రాజెక్టుకు నిధులు అందించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు సమకూర్చే అంశాన్ని కూడా పరిశీలిస్తామని సింగరేణి సంస్థ పేర్కొన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి సంస్థకు మంత్రి, ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు గుర్తు చేశారు. విద్యార్థులకు వారంలో ఆరు రోజుల పాటు అల్పాహారం అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మెనూలో భాగంగా వారంలో 3 రోజులు పాలు, మరో 3 రోజులు రాగి జావ అందించనున్నట్లు వివరించారు.



పిల్లలకు పౌష్టికాహారం అందించడం కేవలం సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదని.. ఆరోగ్యవంతమైన భవిష్యత్ తరాన్ని నిర్మించేందుకు చేసే పెట్టుబడి అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించి, భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంలో భాగంగా ఈ కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు కీలకమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ భారీ స్థాయి కార్యక్రమం అమలులో ఆహార నాణ్యత, సమయానికి సరఫరా, పరిశుభ్రత, పర్యవేక్షణ వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఇతర సంక్షేమ, విద్యా కార్యక్రమాల గురించి కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని నవంబర్ 19వ తేదీన ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల ఆర్థిక రక్షణ అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అలాగే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు. ఒక్కో పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.200 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. వివిధ సామాజిక వర్గాల విద్యార్థులకు ఒకే చోట నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య అందించడమే ఈ పాఠశాలల లక్ష్యంగా వివరించారు. పాఠశాల స్థాయిలోనే పిల్లలకు పౌష్టికాహారం అందించడం వల్ల వారి ఎదుగుదలకు తోడ్పాటు లభిస్తుందని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఉదయం అల్పాహారం తీసుకోకుండా పాఠశాలకు వచ్చే పిల్లలకు ఈ కార్యక్రమం ఉపయోగపడే అవకాశం ఉంది. అయితే పథకం ఫలితాలు మెరుగ్గా ఉండాలంటే ఆహారంలో పోషక విలువలు, నాణ్యత, సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచిస్తున్నారు. మునగాల కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం పూర్తయి, సేవలు ప్రారంభమైతే సూర్యాపేట జిల్లాలో వేలాది మంది విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి అల్పాహారం అందించే వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు అమలు తీరు, ఆహార సరఫరా సామర్థ్యం, విద్యార్థులకు అందే ప్రయోజనాలు తదుపరి కీలక అంశాలుగా మారనున్నాయి.

## తెలంగాణలో కరవు పరిస్థితులు..

మొదటిపేజీ తరువాయి..

మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ



అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జల, వ్యవసాయం, పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు. నైరుతి రుతుపవనాల (జూన్–సెప్టెంబర్) వర్షపాతంతో పాటు 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినందున, దీనికి అవసరమైన సమగ్ర సమాచారంతో మరో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. కరవు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి, ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్రానికి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరనుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. గతంలో సుమారు 235 మండలాల్లో కరవు పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేయగా, తాజా అంచనాల్లో ప్రకారం ఆ సంఖ్య 320కి పెరిగింది.

## మేజర్ అయిన కుమార్తెను బలవంతం చేయలేరు

మొదటిపేజీ తరువాయి..

చేయలేమని తేల్చిచెప్పింది. ఈ మేరకు సెప్టెంబర్ 28న జస్టిస్ సందీప్ జైన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. ఈ మేరకు తన కుమార్తెను కోర్టు ముందు హాజరుపరచాలని తల్లి కళావతి దేవి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కళావతి దేవి అనే మహిళ తన 25 ఏళ్ల కుమార్తె పూజను కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. తన కుమార్తె అదృశ్యమైందని, ఆమెను ఎవరైనా అక్రమంగా నిర్బంధించి ఉంటారనే అనుమానంతో ఆమె ఈ పిటిషన్‌ను వేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు, 2026 ఆగస్ట్ 17న యువతిని కోర్టు ముందు హాజరుపరచాలని ప్రభుత్వం, పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు యువతిని కోర్టుకు తీసుకొచ్చారు. న్యాయమూర్తి సమక్షంలో జరిగిన విచారణలో 25 ఏళ్ల పూజ అత్యంత స్పష్టంగా తన అభిప్రాయాలను వెల్లడించింది. తనను ఎవరూ నిర్బంధించలేదని, ఢిల్లీలో స్వతంత్రంగా నివసిస్తున్నానని తెలిపింది. అంతేకాకుండా, తల్లితో కలిసి ఉండేందుకు సుముఖంగా లేనని తేల్చిచెప్పింది. తన పట్ల తల్లి ప్రవర్తన సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లి తనను తరచూ శారీరకంగా హింసించడంతో పాటు, తీవ్రమైన దుర్భాషలాడేవారని, ఆ వేధింపులు భరించలేకే తాను ఇంటి నుంచి బయటకు వచ్చానని పూజ కోర్టుకు వాంగ్మూలం ఇచ్చింది. కుమార్తె తన వాంగ్మూలంలో చేసిన ఆరోపణలను తల్లి కళావతి ఖండించారు. తల్లిగా తాను తన కుమార్తె క్షేమాన్ని కోరుకుంటున్నానని చెప్పారు. తనతో కలిసి ఉండాలని కోరుకుంటున్నట్లు కోర్టుకు తెలిపారు.

## ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం..

మొదటిపేజీ తరువాయి..

అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు




లెక్చరర్లకు షో–కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న–సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు. ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ–సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967